వైఎస్ఆర్-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
సోమవారం 24 ఏప్రిల్ 2023

## 24న కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం

కడప ఏప్రిల్ 23, ప్రభాతవార్త

రాయచోటి : ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈ నెల 24 న సోమవారం ఉదయం 10.00గం.ల నుండి "స్పందన" అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని రాయచోటి అన్నమయ్య జిల్లా కేంద్రంతో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కూడా యధావిధిగా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గిరీష పిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. ముఖ్యంగా.. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే స్పందనకు రాగలరని తెలిపారు. స్పందన కార్యక్రమం ప్రారంభానికి ముందు సోమవారం ఉదయం 9.45 గంటలకు అధికారులతో స్పందన పెండింగ్ దరఖాస్తులపై సమీక్ష సమావేశం నిర్వహిస్తామన్నారు. స్పందనకు సంబంధించి ఎస్ఎల్ఏ పరిధి దాటిన దరఖాస్తులు అన్నింటిని వెంటనే పరిష్కరించి పూర్తి సమాచారంతో సమావేశానికి హాజరుకావాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అలాగే స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై కూడా సమీక్షిస్తామన్నారు. అధికారులతో సహా స్పందనలో పాల్గొనే ప్రతి ఒక్కరూ కొవిడ్ ప్రోటోకాల్ తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## సౌమ్యనాథుని సన్నిధిలో విజయనగరం జిల్లా జడ్జి

నందలూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



జిల్లాలో చారిత్రాత్మక సుప్రసిదద్ధ దేవాలయమైన నందలూరులోని శ్రీ సౌం దర్యవల్లి సమేత సౌమ్యనాథస్వామి ఆలయాన్ని ఆదివారం రోజున విజయ నగరం జిల్లా జడ్జి బి.సాయికళ్యాణ్‌చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించు కున్నారు. ఆయన రాక నందలూరు జూనియర్ న్యాయమూర్తి కె.లత ఆధ్వర్యంలో ఆల య పూజారులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ విశిష్టత గురించి, స్వామివారి చరిత్ర గురించి తెలియజేసి ఆలయ మర్యాదలతో శాలు వా, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ శంకర్‌నాయక్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

# నాగుల చెరువు ప్రక్షాళనకు శ్రీకారం



బద్వేలు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :

పట్టణ నడిబొడ్డున ఉన్న నాగుల చెరువు ప్రక్షాళనకు అధికారులు శ్రీకారం చుడుతున్నట్లు సమాచారం. నాగుల చెరువులో ఆక్రమణలు జరగడమేగాక నిర్మాణాలు కూడా జరిగిన నేపథ్యంలో వాటిపై ప్రత్యేక దృష్టిపెట్టిన అధికారులు దశల వారీగా తొలగించే ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది. నిజమైన పేదవాడు ఇల్లు లేని కుటుంబం ఉంటే ఖచ్చితంగా ఇల్లు కల్పిస్తామని, అలా కాకుండా చెరువులో ఆక్రమణలు చేపట్టి పట్టాలు ఇవ్వమంటే అది అధికారులకు సాధ్యమయ్యే పని కాదని హెచ్చరించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో నాగుల చెరువు ప్రక్షాళనకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే సర్వే అధికారులు ఎక్కడెక్కడ కబ్జాలు జరిగాయి? నాగుల చెరువు ఎంతకు కబ్జాకు గురైంది? చెరువుకు సంబంధించిన వాటిలో ఎన్ని ఆక్రమణలతో నిర్మాణాలు చేపట్టారనే వాటిపై దృష్టి పెట్టారు. వీటి కోసం ప్రత్యేక టీంను ఏర్పాటుచేసి ప్రక్షాళనకు శ్రీకారం చుడుతున్నట్లు తెలుస్తుంది. ఇన్ని రోజులు నాగుల చెరువు కబ్జాలపై దృష్టిపెట్టని అధికారులు ఇకపై వదిలే ప్రసక్తే లేదని, ఇప్పటికే ఆలస్యమైందని, ప్రక్షాళన జరిగి తీరుతుందని గట్టిగా చెబుతున్నారు. పోరుమామిళ్ళ బైపాస్ రోడ్‌లో వామపక్షాలు ఏర్పాటుచేసిన గృహాల తొలగింపునకు కూడా శ్రీకారం చుడుతున్నట్లు సమాచారం.

**సుందరీకరణ ఏర్పాట్లపై దృష్టి**

**ప్రణాళికబద్ధంగా ప్రక్షాళన**

**చెరువుల ఆక్రమణల తొలగింపుకు త్వరలో శ్రీకారం**

అక్కడ ఉన్న పేదలందరి జాబితాను సిద్ధం చేసినట్లు తెలిసింది. నిజమైన పేదవాడు ఉంటే వెంటనే స్థలం ఇవ్వడమేగాక ఇల్లు కూడా నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అలా కాకుండా ఎక్కడో దూర ప్రాంతాల నుండి ఇక్కడికి వచ్చి చెరువులో ఆక్రమణ చేపడితే సహించేది లేదంటున్నారు. ప్రొద్దుటూరు, పోరుమామిళ్ళ, మైదుకూరు, కలసపాడు, కడప, అట్లూరు, నెల్లూరు జిల్లా ఉదయగిరి, మర్రిపాడు లాంటి పలు ప్రాంతాలకు చెందిన అనేక మంది తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని ఉంటున్న నేపథ్యంలో అధికారులు ప్రణాళికబద్ధంగా వాటిని తొలగించే ఏర్పాట్లపై దృష్టి పెట్టారు. చెరువు, కుంటలకు సంబంధించిన స్థలాల్లో పట్టాలు ఇచ్చేందుకు జిల్లా స్థాయి అధికారులకు కూడా అనుమతి లేదని, వీటన్నిటిపైన సీఎం ఆఫీసు నుండి జరగవలసి ఉంటుందని, ఇక్కడ ఏ అధికారులకు పట్టాలు ఇచ్చే అనుమతి ఉండదని రెవిన్యూ అధికారులు తెగేసి చెప్పారు. ఎన్ని రోజులు నిర్మాణాల చేపట్టి నివాసం ఉంటున్నా ఏదో ఒక తొలగించడం తథ్యం అని రెవిన్యూ అధికారులు కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేశారు. దీనిని బట్టి చూస్తుంటే ఏదో ఒక రోజు నాగుల చెరువులోని ఆక్రమణలన్నీ తొలగిపోవడమేగాక పోరుమామిళ్ళ బైపాస్ రోడ్‌లో ఉన్న నిర్మాణాలు కూడా పూర్తిగా తొలగించడం జరుగుతుందని తేలిపోయింది. ముఖ్య విషం ఏమిటంటే పోరుమామిళ్ళ బైపాస్ రోడ్‌లో వామపక్షాలు వేసిన నిర్మాణాలలో అనేక లావాదేవీలు జరగడమేగాక వేల నుండి లక్షల రూపాయలు ఖర్చు పెట్టి స్థలాలు కొనుగోలు చేసి నిర్మాణాలు చేపట్టారనే సమాచారం అధికారులు సేకరించారు. అది కూడా బయట వ్యక్తులు వచ్చి ఇక్కడ చెరువులో నిర్మించుకునేందుకు అనుమతి లేకపోయినప్పటికీ ఇష్టానుసారంగా నిర్మించుకోవడం పట్ల అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అక్కడికి వెళుతున్న అన్ని సౌకర్యాలను తొలగించే ఏర్పాట్లపై అధికారులు దృష్టి పెట్టినట్లు సమాచారం. ఆ ప్రాంతం అంతా ఖాళీ చేయవలసిందేనని, చెరువు పోరంబోకు స్థలాల్లో నిర్మాణాలకు అనుమతి ఉండదని అధికారులు తేల్చి చెప్పారు.

# జగనన్న పాలనలో సంక్షేమ విప్లవం

**- అర్హతే ప్రామాణికంగా పథకాల లబ్ధి**

**- ఎర్రటి ఎండను సైతం లెక్కచేయకుండా గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి**

సంబేపల్లె, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

జగనన్న పాలనలో సంక్షేమం విప్లవం కొనసాగుతోందనిఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఆది వారం సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామంలో ఉదయం 6 గంటలకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కడియాల వాండ్ల పల్లె, కె.కె.హరిజనవాడ, చిన్నబిడికి, మొరంవడ్డెపలెన్ల, బండకాడపల్లె, రాజువారిపల్లె హరిజనవాడ, పెద్దబిడికి, పరకలబండ, బిడికి, బురుజుకాడ హరి జన వాడలలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ ఆవుల నాగశ్రీలక్ష్మీ, మాజీ జడ్పీటీసీ గొర్ల ఉపేంద్రారెడ్డి, జడ్పీటీసీ గొర్ల కవిత, గొర్ల రమేష్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్కుమార్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణ నాయక్, లయన్ ఎర్రపురెడ్డి బ్రహ్మానందరెడ్డి, లక్ష్మీకర్‌రెడ్డి, వాయల్పాటి ఆనంద కుమార్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, శివారెడ్డిలతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఇంటింటా ఎకాంత్‌రెడ్డి పర్యటించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు వివరిస్తూ ప్రజా సమస్యలపై ఆరా తీస్తూ ప్రజలతో మమేకమయ్యారు. కడియాలవాండ్లపల్లెలో సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు వైస్ ఎంపీపీ పొత్తూరి రవీంద్రనాయుడు ఎమ్మెల్యేని దుశ్శాలు వాతో సత్కరించారు.

**అగ్రవర్ణ పేద మహిళల నేస్తం వైఎస్ఆర్ ఈబీసీ నేస్తం..**

కడియాలవాండ్లపల్లెలో కమ్మ మహిళల హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. అగ్రవర్ణ పేద మహిళల నేస్తం వైఎస్ఆర్‌ఈబీసీ నేస్తం అంటూ కడియాలవాండ్ల పల్లెలో కమ్మ కులానికి చెందిన మహిళలు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఎదుట పేర్కొన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికి ఈబీసీ నేస్తం అందిందన్నారు. ప్రతి ఇంటికి రెండు మూడు పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే సంతోషం వ్యక్తం చేశారు. పలువురు గ్రామ ప్రజలు తమకు అందుతున్న పథకాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చి సంతోషం వెలిబుచ్చి ఈ సందర్భంగా ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో



భాగంగా వెంకటరమణ నాయక్ తనకు కిడ్నీ వ్యాధికి ఆరోగ్య శ్రీ కింద ఉచితంగా వైద్యం పొందామని శ్రీకాంత్‌రెడ్డి ఎదుట హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు మహేశ్వరి, ఎంపీడీవో నరసింహులు, రాష్ట్ర కార్యదర్శి జేసీఎస్ కన్వీనర్ వడ్డీ వెంకట రమణారెడ్డి, మాజీ ఎంపీపీ నాగిరెడ్డి, కిశోర్‌రెడ్డి, మాధ వయ్య, ఎంఎస్ వెంకట రమణ నాయుడు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బుల్లి వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ శివయ్య, రమణారెడ్డి, లాయర్ శ్రీనివాసులురెడ్డి, శంకరయ్య నాయుడు, తిరుపాల్ నాయక్, డీలర్ వెంకటేశ్వర నాయుడు, జనార్ధన్ నాయుడు, ఉమా మహేశ్వరనాయుడు, మహేశ్వర, పెరుమాళ్, సోని నాయక్, వెంకటేశ్వర నాయుడు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# నిలిచిపోయిన సచివాలయ భవనాల పనులు

**ఆందోళనలో గుత్తేదారులు ...యేడాదిగా బిల్లులు బంద్**

**ఉపాది పనులకు తప్పని నిధుల మళ్లింపు సమస్య**

రాజంపేట అర్బన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించి చేపట్టిన సచివాలయ వ్యవస్థలో పనులకు నిధుల కొరత తీవ్రమైంది. నిర్మాణం పనులు చేసిన సర్పంచ్‌లు, గుత్తేదారులు లబోదిబోమంటున్నారు. యేడాదిగా బిల్లులు పడకపోవడంతో ఎక్కడ పనులు అక్కడ నిలిచిపోయాయి. ఒకవైపు బిల్లులు లేక అవస్థలు పడుతుంటే మరోవైపు జిల్లాస్థాయిలో అటు కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌లు ఉన్నతస్థాయి ఇంజనీరింగ్ అధికారులు ఇంజనీర్లపై పనులు పూర్తి చేయాలని తీవ్ర ఒత్తిడి చేస్తున్నారు. అయినా కూడా సర్పంచ్‌లు ఎవరూ పనులు ప్రారంభించే ధైర్యం చేయడం లేదు. ప్రతి సచివాలయ భవనానికి రాష్ట్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాది పథకం ద్వారా పనులు చేపట్టింది. ఒక్కో (మిగతా IIవ పేజీలో)

## తూకాల్లో తిరకాసేమి తిరుమలేశ

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

మంగంపేట ఏపీఎండీసీ బెరైటీస్ ప్రాజెక్టు కొందరికి ఆదాయ వనరుగా మారింది. అక్రమాలకు అడ్డూ, అదుపు లేకుండా పోతోంది. తరచూ ఏదో ఒక విభాగంలో అవినీతి రొచ్చు బయట పడుతోంది. కొందరి అధికారులకు తెలిసీ జరిగితే మరికొన్ని పర్యవేక్షణ లోపంతో జరుగుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఆరు దశాబ్దాల క్రితం మంగంపేట ఏపీ రాష్ట్ర ఖనిజ సంస్థ ఏర్పాటైంది. అప్పటి నుంచి దినదినాభివృద్ధి చెందుతోంది. మొదటిలో మనుషులతో ముగ్గు రాయి ఖనిజం వెలికితీత పనులు జోరుగా జరిగేవి. మారుతున్న కాలాన్ని బట్టి యాంత్రీకరణ ద్వారా బెరైటీస్ ఖనిజ నిక్షేపాలను వెలికి తీయడం జరిగింది. రెండున్నర దశాబ్దాలుగా ఖనిజం వెలికితీత వేగం పుంజుకుంది. అదే స్థాయిలో అవినీతి అక్రమాలు పెరిగాయి. అక్రమార్కుల జాబితా కూడా పెరుగుతూనే ఉంది. కొందరు సంస్థలో పని చేసేవారైతే మరికొందరు బయటి వారు సాంకేతిక సొభగులకు అవినీతి మరకలు అంటించారనే చెప్పవచ్చు. ఏపీఎండీసీలో పని చేసే అధికారులు, సిబ్బంది మరియు కార్మికుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రత్యేకంగా సంస్థ లక్షలాది రూపాయల నిధులు కేటాయిస్తూ అన్ని విధాలా వారి బాగోగులు సంస్థ చూసుకుంటూ ప్రశంసలు అందుకుంటోంది. మంగంపేటతో పాటు ఓబులవారిపల్లె మండలం మొత్తం (మిగతా IIవ పేజీలో)

## 24న దిశ కమిటీ సమావేశం

**కలెక్టర్,దిశ కమిటీ సెక్రటరీ గిరీష్ పిఎస్**

రాయచోటి ఏప్రిల్ 23, ప్రభాతవార్త



ఈనెల 24న సోమవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి రాజంపేట ఎంపీ మరియు లోక్ సభ స్పీకర్ ప్యానల్ మెంబర్ మిథున్ రెడ్డి ఆధ్వర్యంలో దిశా కమిటీ సమావేశం జరుగు తుందని దిశా కమిటీ కన్వీనర్, జిల్లా కలెక్టర్ గిరిశ పిఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల మీద సమీక్ష జరుగు తుందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి.. జిల్లా అధికారు లందరూ జిల్లాలో చేపడుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల మీద రిపోర్టులను తీసుకొని రావాలని ఆదేశించామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్షకు జిల్లాలోని ఎమ్మెల్యేలను, ఉమ్మడి కడప, చిత్తూరు జిల్లాల జడ్పీ చైర్మన్లను, మున్సిపల్ చైర్మన్లను, ఇతర ప్రజా ప్రతినిధులను హాజరు కావాలని కోరినట్లు ఆయన తెలిపారు

# ధర, దిగుబడి లేని పసుపు

**- కొనుగోలు కేంద్రం ఏర్పాటులో జోక్యం**

దువ్వూరు, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

ఏడాదిలో 8 నెలల పాటు రైతులు శ్రమించి పండించిన పసుపు పంటలకు దిగుబడి, ధర లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో సుమారు 550 ఎకరాల్లో పసుపు పంట సాగు చేశారు. సాగుకు పెట్టిన పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని రైతులు వాపోతున్నారు. గతంలో ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్లు దిగుబడి వచ్చేది ఈ ఏడాది కనీసం 20 క్వింటాళ్లు కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పసుపఉ క్వింటాళు రూ.5400 పలుకుతోంది, ఇది కూలీల ఖర్చుకు కూడా చాలడం లేదంటున్నారు. పసుపు పంట విత్తనం వేసినప్పటి నుంచి పంట దిగుబడి తీసే వరకు అధిక ఖర్చులుంటాయని పసుపు ఉడికించి ఆరబెట్టి మార్కెట్‌కు తరలించాల్సి ఉంటుందన్నారు. దీనికి ఎకరాకు రూ.లక్ష వరకు పెట్టుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం గిట్టుబాటు కావడం లేదని రైతులు అంటున్నారు. పంట మద్దతు ధర కోసం గతంలో రైతులు ఆందోళనలు చేపట్టారు. పండిన పసుపును గోదాంలో నిల్వ ఉంచి గిట్టుబాటు ధర కోసం ఎదురుచూవారు. అయినా ధర పెరగడకపోవడంతో రైతులు నష్టపోయారు గతంలో ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా రెండేళ్ల కిందట 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి క్వింటాళుకు రూ.6850 చొప్పున జిల్లా వ్యాప్తంగా 18వేల టన్నుల పసుపు కొనుగోలు చేసింది.తరువాత గత ఏడాది కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు కానీ ప్రభుత్వం ప్రభుత్వం కొనుగోలు చేసే సమయంలో కఠినమైన నిబందనలు, నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పసుపు కొనుగోలు జరగలేదు.



అధికారులు పసుపు కొనుగోలు చేస్తామని ప్రకటించి 20 రోజులు అవుతోంది. ఇటీవల గడప గడపకు కార్యక్రమంలో కూడా మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని చెప్పినా అధికారులు ఆ విధంగా చర్యలు తీసుకోలేదని చెప్పవచ్చు. మైదుకూరులో పసుపు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంది. అక్కడ గతేడాది రూ.6850తో కొనుగోలు చేశారని, కనీసం ఈసారి ప్రభుత్వం రూ.10వేలు కేటాయించాలని రైతులు కోరుతున్నారు. మండలంలో సుమారు 600 ఎకరాల్లో పసుపు సాగు చేశారని వీరి పంటను కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

**నెరవేరిన ప్రజల తాగునీటి కల** IIలో
**ప్రొద్దుటూరు ఎమ్మెల్యే**

**నీటి ట్యాంకులో పడి మహిళ మృతి** IIIలో

## దూకుడు పెంచిన సీబీఐ

**- వైఎస్ వివేకా, వైఎస్ అవినాష్‌ల ఇళ్లు పరిశీలన**

**- వివేకా కంప్యూటరు ఆపరేటరు ఇనయతుల్లాను విచారించిన సీబీఐ**




పులివెందుల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :

మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సీబీఐ దూకుడు పెంచింది. ఆదివారం సీబీఐ అధికారులు సీన్ రీకన్‌స్ట్రక్షన్‌లో భాగంగా పులివెందులలోని వైఎస్ వివేకానందరెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల ఇళ్లను మరోమారు పరిశీలించారు. వీరి ఇళ్ల మధ్య దూరాన్ని కూడా కొలిచారు. అలాగే వివేకా హత్యకు ముందు, తరువాత హంతకులు వెళ్లిన ప్రదేశాలను పరిశీలించారు. వివేకా కంప్యూటరు ఆపరేటరు ఇనయతుల్లాను కారులో ఎక్కించుకుని విచారిస్తూ అవినాష్‌రెడ్డి ఇంటికి తీసుకువెళ్లారు. వివేకా హత్య జరిగిన రోజున వివేకా భౌతికకాయాన్ని ఇనయతుల్లా ఫోటోలు, వీడియోలు తీసి వివేకా కుటుంబ సభ్యులకు పంపించారు. ఉదయం సమయంలో, సాక్షాలను తుడిచే సమయంలో అక్కడ ఎవరెవరు ఉన్నారు, వాళ్లు ఏమి సూచనలు చేశారు.. అనే విషయం మీద కూడా విచారించి అతను చెప్పిన విషయాలను నమోదు చేసుకున్నారు. అలాగే ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రమణారెడ్డిని రింగ్‌రోడ్డులో ఉన్న శ్రీకృష్ణ దేవాలయం దగ్గర విచారించారు.

# ఇసుకాసురుల చెరలో పెన్నానది

- తరలిపోతున్న పెన్నానది కోట్ల సంపద
- నది గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకత
- నెలవారి మామూళ్లతో నిద్రపోతున్న అధికారులు
- ప్రభుత్వ కార్యాలయాల ఎదురుగానే రాకపోకలు
- గత సంవత్సరం డిసెంబరు నెలలోనే కాలం చెల్లిన ఇసుక అనుమతులు



సిద్దవటం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

రోజులు కాదు, వారాలు కాదు నెలల తరబడి తంతు జరుగుతున్నా నెల వారి మామూళ్ల మత్తులో సంబంధిత అధికారులు నిద్రలేవడం లేదని పెన్నా నది గ్రామాల ప్రజలు ముక్తకంఠంతో ఏకమై వ్యతిరేకిస్తూ నిరసనలు తెలిపినా ఆగని పెన్నానది ఇసుక రవాణా. పెన్నానది ఇసుక అక్రమ తవ్వకాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న వ్యవహారంపై గనుల శాఖ, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో రెండు శాఖల అధికారులు ఒకరిపై ఒకరు వేసుకుంటూ ఉండడంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పెన్నానది గర్భం నుంచి కోట్ల విలువ చేసే ఇసుక సంపద ప్రభుత్వ కార్యాలయాల కళ్ల ముందే ఇసుక వాహనాల రాకపోకలు జరుగుతున్న వ్యవహారంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. పెన్నానది ఇసుక తవ్వకాలపై రాజకీయ అండ ప్రభావమో లేక సంబంధిత అధికారుల నెలవారి ముడుపుల మాయ వల్లనో తెలియని పరిస్థితి. గనుల శాఖ పరిధి మేరకు ఒక మీటరు లోతు వరకే పెన్నా నది ఇసుక తీయాలన్న ప్రభుత్వ నిబంధనకు పాతర వేసి సుమారు మూడు నాలుగు మీటర్ల లోతు వరకు యథేచ్ఛగా ఇసుక రవాణా జరుపుతున్నారు. పెన్నానదిలో ఒక చోట అనేది లేకుండా ఎక్కడ పడితే అక్కడ ఇష్టం వచ్చినట్లు పెద్ద పెద్ద యంత్రాల ద్వారా ఇసుకను తవ్వేస్తున్నా చలనం లేకుండా ఉన్న తీరుపై ప్రభుత్వ అధికారుల ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. పెద్ద పెద్ద వాహనాలలో సైతం వేయాల్సిన ఇసుక కన్నా రెట్టింపు మొత్తంలో లోడు చేసి రాత్రి, పగలు అనే తేడా లేకుండా సమయపాలన లేకుండా ఇసుక రోడ్డుపై వెళ్తున్న అటు వైపు చూసే నాథుడే కరవయ్యారు. వీరికి తోడు రెవెన్యూ, పోలీసు శాఖల నియంత్రణ కూడా అంతంత మాత్రమే. ఇసుక అక్రమ తవ్వకాల వల్ల భూగర్భ జలాలు అడుగంటినా ప్రకృతికి తీరని నష్టం వాటిల్లినా సొంత లాభమే ధ్యేయంగా ఇసుక రవాణా జరుగుతున్నది. ఇసుక తవ్వకాలకు గత సంవత్సరం డిసెంబరు నెలలోనే కాలం చెల్లినా అటువంటి ప్రభుత్వ నిబంధనలు తమకేమీ వర్తించవన్నట్లు జంగాలపల్లి పరిధిలోని పెన్నానదిలో జరుగుతున్న ఇసుక తవ్వకాలే ఇందుకు నిదర్శనంగా నిలిచింది. ఇది సరిపోదన్నట్లుగా కొత్తగా సుమారు రెండు వారాల నుంచి ఎస్.రాజంపేట పెన్నానదిలో ఇసుక రవాణా జరుగుతుండడం కూడా ఇదే తంతు. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులకు తెలియనట్లు తమ దృష్టికి రానట్టు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారే తప్ప అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వపరంగా చట్టరీత్యా చర్యలు తీసుకోకపోవడం విడ్డూరంగా మారింది. పెన్నానదిలో కోట్ల ఇసుక సంపద తరలిపోతున్నా అడ్డుకట్ట వేసే దారే లేకుండా పోయింది. ఈ విషయంపై గనుల శాఖాధికారిని వివరణ కోరగా పెన్నానదిలో ఇసుక తవ్వకాలు ఎటువంటి అనుమతులు లేవని తెలపడం జరిగింది.

## శుభకార్యానికి వెళ్తూ కానరానిలోకాలకు

**రోడ్డు ప్రమాదంలో భార్యమృతి**

మదనపల్లెక్రైం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :



రోడ్డు ప్రమాదంలో భార్య మృతి చెందగా భర్త, ఇంద్దరు కుమారులు తీవ్రంగా గాయ పడ్డారు. ఈ సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో చోటు చేసుకొంది. తాలూకా పోలీసుల కథనం మేరకు కురబలకోట మండలం ముదివేడు పంచాయితీ సిద్దేవారిపల్లెకు చెందిన సిద్దే చంద్రమోహన్‌నాయుడు, కాంతమ్మ కొంతకాలం కిందట ఉపాధి నిమిత్తం మదనపల్లెకు వచ్చారు. పట్టణంలోని వైఎస్ ఆర్ కాలనీలో నివాసముంటూ చేనేత కార్మికునిగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు జనార్ధన్‌నాయుడు, సురేష్‌నాయుడులు ఉన్నారు. ఈ నేపథ్యంలో పాళ్యంకొండలో జరుగుతున్న బంధువుల నిశ్చితార్థం బయలు దేరారు. దారిలో తట్టివారిపల్లె సమీపంలో వెనుక నుంచి వస్తున్న టిప్పర్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొంది. ఈ ప్రమాదంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో కాంతమ్మ(42) రోడ్డుపై పడడంతో టిప్పర్ మీదెక్కి వెళ్లడంతో ఆమెకు నడుము, కాళ్ళు పూర్తిగా నలిగిపోయాయి. చంద్రమోహన్ నాయుడు, జనార్ధన్ నాయుడు, సురేష్‌నాయుడు తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు క్షతగాత్రులు 108లో జిల్లా ఆసుపత్రికి తరలించారు. కాంతమ్మ పరిస్తితి విషమంగా మారడంతో మృతి చెందింది. విషయం తెలియడంతో నిశ్చితార్థం వాయిదా పడింది. దీంతో బంధువులు పెద్దసంఖ్యలో ఆసుపత్రికిచేరుకొని బోరున విలపిం చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు సిఐ సత్యనారాయణ తెలిపారు.

# పెరుగుతోన్న ఉష్ణోగ్రతలు... తీసుకోవాల్సిన జాగ్రత్తలు

దేశంలో వేడిగాలులు ఇప్పటికే అందరినీ ఆందోళనకు గురి చేస్తున్నాయి. వేసవి కాలం అంటేనే వేడి గాలులు, కొబ్బరి బోండాలు, కూలింగ్ డ్రింక్స్, కాటన్ దుస్తులు, మామిడి పండ్లు వంటివి తినే అవకాశాన్ని కల్పిస్తుంది, ఇదే సమయంలో వేడి, చెమట, ఇన్ఫెక్షన్‌లను తట్టుకోవడం గురించి కూడా చెప్పవచ్చు. దీంతో హీట్‌వేవ్ సైడ్ ఎఫెక్ట్స్ కూడా పడక తప్పదు. అయితే మీ మూడ్ కూడా వేడి వల్ల ప్రభావితమవుతుంది.

**హీట్ వేవ్ సైడ్ ఎఫెక్ట్స్, మూడ్ మార్పులు**

ఒక అధ్యయనం ప్రకారం, యుఎస్‌లో వేసవి నెలల్లో అధిక ఉష్ణోగ్రతలు ఉన్న రోజులు మానసిక రుగ్మతలతో సహా మానసిక ఆరోగ్య సంబంధిత పరిస్థితి కూడా రెట్టింపు అయిందట. ఈ అధిక వేడి ఉష్ణోగ్రతలు బేస్‌లైన్ మూడ్ స్టేట్‌లను మారుస్తాయని, ప్రజలను మరింత చిరాకుగా, కోపంగా కొన్నిసార్లు నిరాశకు గురిచేస్తాయని ఈ అధ్యయనం చెబుతుంది. దీనికి కారణ మేమిటో స్పష్టంగా అర్థం కానప్పటికీ, శరీర ఉష్ణోగ్రతలో మార్పులు, నిర్జలీ కరణం, సరైన నిద్ర లేకపోవడం, సూర్యరశ్మికి అధికంగా బహిర్గతం కావడం వంటివి మెదడు పనితీరును ప్రభావితం చేస్తాయని తేలింది.

**హీట్ వేవ్ సమయంలో**

1. కుటుంబ సభ్యులతో, స్నేహితులతో చికాకుగా ప్రవర్తించకుండా కాస్త కూల్‌గా ఉండేందుకు చూడండి. మానసిక స్థితిలో మార్పులను గమనిస్తే వ్యాయామం చేయండి. ఇది చికాకు నుంచి దూరం చేస్తుంది.
2. అతిగా విసుగు చెందడం వల్ల నియంత్రణలో లేని వాతావరణం సరైపోదు. కాబట్టి సమయాన్ని కాస్త బిజీగా గడిపేలా ప్లాన్ చేసుకోవాలి. ఏదో పనిలో బిజీగా గడిపితే తరవాత అంతా సరైపోతుంది.
3. మధ్యాహ్నం ఎండలో పని కోసం డ్రైవింగ్ చేయడం, 40 డిగ్రీల సెల్సియస్‌లో ఉన్నప్పుడు లైన్‌లో నిలబడటం ఇబ్బంది కలిగిస్తుందా? రోజువారీ



షెడ్యూల్‌లో మార్పులు చేసి, అటువంటి పనులను ముందుగానే ప్లాన్ చేసుకోండి. చికాకు తగ్గాలంటే సాయంత్రం కాగానే కాస్త చల్లని నీటితో స్నానం చేసినా మంచి ఫలితం ఉంటుంది.
4. హైడ్రేషన్ కొన్నిసార్లు బిజీ షెడ్యూల్ కారణంగా నీరు తాగడం మర్చిపోవచ్చు, కానీ హైడ్రేటెడ్‌గా ఉండండి. పగటిపూట ఎంత నీరు తాగారో లెక్క తెలిసేలా నీళ్ళ బాటిళ్లను ఉపయోగించండి. మహిళలకు సగటున 2.7 లీటర్ల నీరు అవసరం. వీటితో పాటు ఈ వేసవిలో జ్యూస్‌లు, కూలింగ్ డ్రింక్స్ కూడా తీసుకోవచ్చు.
5. లోతైన శ్వాస, ధ్యానం కేవలం 15 నిమిషాలు ధ్యానం కోసం వెచ్చించండి. ప్రతి ఉదయం మూడ్ మార్పులు, కోపాన్ని నియంత్రించడంలో సహాయ పడుతుంది. మెరుగైన మానసిక ఆరోగ్యం కోసం ఈ చిట్కాలను పాటిం చండి. ఈ వేసవిలో ప్రశాంతంగా ఉంటుంది.

## శ్రీనందవరం చౌడేశ్వరీదేవి పురస్కారాలు

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణంలోని శ్రీ చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అష్టమ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో నిష్ణాతులైన ముగ్గురికి నందవరం శ్రీ చౌడేశ్వరీ దేవి పురస్కారాలు అందించినట్లు వ్యవస్థాపక అధ్యక్షులు కంభం పాములేటి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీ కోదండ రామస్వామి దేవాలయం కళ్యాణ మండపంలో శ్రీ చౌడేశ్వరి ఆర్ట్స్ అసోసియేషన్ అష్టమ వార్షికోత్సవం సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షులు కంభం పాములేటి మాట్లాడుతూ సంస్థను ఆదరిస్తూ అనేక కార్యక్రమాలకు సహకరించిన దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 8 సంవత్సరాల కాలంలో వివిధ రంగాలలో నిష్ణాతులైన వారిని గుర్తించి 46 మందికి పురస్కారాలు అందించామన్నారు. అందులో భాగంగా ఆదివారం ప్రముఖ సాహితీవేత్త పేర్లంటి లక్ష్మి కులశేఖర్ కి సాహిత్య కళారత్న అవార్డు ప్రదానం చేశారు. ప్రముఖ రంగస్థల నటి ఆర్. శారదాభాయి కి నట కళా రత్న అవార్డు, ప్రముఖ రంగస్థల నటులు యస్.నాగమునికి గాన కళారత్న అవార్డులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ విజయలక్ష్మి మాట్లాడుతూ భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా కళలను కళాకారులను ప్రోత్సహించాలని తెలిపారు. రాష్ట్రంలో వివిధ కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథిగా ఎంపి తొగటవీర క్షత్రియ సేవా సంఘం అధ్యక్షులు మోడెం వీరాంజనేయ ప్రసాద్, మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, గౌరవ అతిథులుగా ఏపీ తొగటవీర క్షత్రియ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి దేవరింటి రేణుక వైసిపి నాయకులు బడిగింజల చంద్రమౌళి, ప్రముఖ కథా రచయిత జింక సుబ్రహ్మణ్యం ఏపీ రాష్ట్ర కడప సాంస్కృతిక విభాగం అధ్యక్షులు సంగిరెడ్డి పుల్లారెడ్డి దేవాంగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగలక్ష్మి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## నిలిచిపోయిన సచివాలయ భవనాల...

(మొదటి పేజీ తరువాయి)



భవనానికి 40 లక్షలు కేటాయించింది. గత యేడాది ఏప్రిల్ 16న చివరి సారిగా బిల్లులు మంజూరయ్యాయి. ఆ తర్వాత బిల్లు పడిన దాఖలాలు లేవు. ఈ విషయాన్ని మండలస్థాయిలో అధికారులే స్పష్టం చేస్తున్నారు. ఎమ్మెల్యే సొంత మండలం నందలూరులో ఈ సమస్య మరింత ఎక్కువగా కనిపిస్తోంది. జిల్లాలోని మేజర్ పంచాయతిల్లో ఒకటిగా రాజంపేట నియోజకవర్గంలో ఏకైక మేజర్ పంచాయతి నాగిరెడ్డిపల్లెకు 3 సచివాలయాలు మంజూరు అయ్యాయి. ఒక సచివాలయాన్ని నందలూరు మండల కాంప్లెక్సులోనే నిర్మించారు. మిగతా 2 పంచాయతి పరిధిలో నిర్మిస్తున్నారు. నాగిరెడ్డిపల్లె సచివాలయం-1, 3 భవనాల నిర్మాణం పనులు స్లాబు కూడా పూర్తయ్యింది. గోడలు కూడా నిర్మిం చారు. ఒక్కో సచివాలయానికి 20 లక్షల నుంచి 22 లక్షల వరకు ఖర్చు చేశారు. కొంత మేరకు బిల్లులు మంజూరైనా మిగతా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు నిలిపివేశారు. సర్పంచ్‌లు చేయనిచోట నియోజకవర్గంలో స్థానిక నేతలు ముందుకు వచ్చి చేస్తున్నారు. నిధులు మంజూరు కాకపోవడంతో వారు కూడా చేతులెత్తేశారు. నిధులు మంజూరు కాకపోవడానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం పంచాయతి పిడి ఖాతాల నుంచి నిధులు మళ్లించడమేనని తెలు స్తోంది. ఈ విషయాన్ని అధికారులు చెప్పలేని పరిస్థితి. అధికారపార్టీ నేతలు కూడా ఏమి చేయలేని నిస్సహాయ పరిస్థితిలో పనులు నిలిపివేశారు. దీంతో పంచాయతిరాజ్ ఇంజనీర్‌లు పనులు చేయాలని ఉన్నతస్థాయిలో ఒత్తిడి తీవ్రం చేయడంపై సర్వత్రా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిధులు లేకపోతే పనులే చేయవద్దని మౌఖిక ఆదేశాలు వివిధ శాఖలకు వచ్చిన నేపథ్యంలో సచివాలయ భవనాల నిర్మాణం పనులు మాత్రం ఎలా చేపట్టాలని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నత స్థాయి అధికారులు పరిస్థితి గమనించి తమపై ఒత్తిడి చేయడం మానుకో వాలని ఇంజనీర్లు కోరుతున్నారు. తమపై ఒత్తిడి చేసే అధికారులు ఉన్నతస్థాయి సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికే ఈ విషయాన్ని తీసుకెళ్లి ఉపాది నిధులు బిల్లులు పడేలా చూడాలని కోరుతున్నారు.


VAARTHA CLASSIFIEDS

**CHANGE OF NAME**

★ I SEKHAR KAKI HOLDER OF Indian passport no L4533078 Indian permanent address Hno 4/112 Rv Nagar Cuddapah Ysr Dist 516003 India residing in Kuwait at present hereby declare that henceforth my name will be read as under Given name SEKHAR and Surname NAGAPPAGARI

(Ro.No.3494)

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.


## పంచాయతీరాజ్ దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

– ఎంపీడీవో గంగయ్య

కలికిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:

పంచాయతీరాజ్ దినోత్సవాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు విజయవంతం చేయాలని ఎంపీడీవో గంగయ్య కోరారు. ఏప్రిల్ 24 జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా పంచాయతీలలో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో కార్యదర్శులు గ్రామ సభలు నిర్వహించాలన్నారు. అదే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవంపై ప్రసంగించే కార్యక్రమాన్ని ప్రజలు వీక్షించే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీడీవో పేర్కొన్నారు.

## బ్రిడ్జి కోర్సు నిర్వహణ జరగలేదు


ప్రిన్సిపల్ చెంగల్‌రాజు

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలోని స్టేట్‌బ్యాంకు ఎదురుగా ఉన్న శ్రీ షిర్డీసాయి జూనియర్ కళాశాల వారు పదో తరగతి పాసైన విద్యార్థులకు బ్రిడ్జి కోర్సు కోచింగ్ ఏర్పాటు చేశామని కొంతమంది ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసిన నేపథ్యంలో సంబంధిత ప్రిన్సిపల్ చెంగల్‌రాజు విలేకరులతో మాట్లాడుతూ బ్రిడ్జి కోర్సు కోచింగ్‌ను పెట్టలేదని, ఆ అవసరం తమకు లేదని కావాలనే కొంతమంది తమ కళాశాలపై పుకార్లు పుట్టిస్తున్నారని, ఇటువంటి వాటిని నమ్మవద్దని ప్రిన్సిపల్ చెంగల్‌రాజు తెలిపారు. తమ కళాశాల గత కొన్ని సంవత్సరాలుగా ఉన్నత ఫలితాలు సాధించడంలో కొంతమంది జీర్ణించుకోలేక తమ కళాశాలపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, ఇటువంటివాటిని నమ్మవద్దని ప్రిన్సిపల్ తెలిపారు.

# పుణ్యక్షేత్రాల విడిది ఉడుపి





భారత పురాణాలు మనకు ముక్తిని ప్రసాదించే ఏడు దివ్య క్షేత్రాల గురించి తెలియజేశాయి. దర్శన స్మరణ పఠన శ్రవణ మాత్రాననే మానవ్వల సర్వ పాపాలు తొలగిపోయి వారిని భగవంతుని సన్నిధికి చేర్చే అవి అయోధ్య, మథుర మాయ హరిద్వార్, కాశి కంచి అవంతిక ఉజ్జయిని, ద్వారక వాటితో సరి సమానమైన స్థలాలు కర్ణాటక రాష్ట్రంలోని ఉడుపి పరిసర ప్రాంతాలలో ఉన్నాయి.

ప్రసిద్ధి చెందిన శ్రీకృష్ణ క్షేత్రాలలో ఒకటిగా పేరొందిన ఉడుపి ఆ పేరు రావడానికి సంబంధించి రెండు రకాల కథనాలు వ్యాప్తిలో ఉన్నాయి. ఉడుపి అంటే నక్షత్రాల దేవ్వడు అని అర్థం. నక్షత్రాల దేవ్వడు వెన్నెల రేడు చంద్రుడు కదా! దక్ష శాపం నుండి సదాశివ్వని కృప వలన విముక్తుడైన నెలరాజు శాశ్వతంగా ఆయన శిరమందు నిలిచిపోయే భాగ్యాన్ని పొందిన క్షేత్రం అయినందున ఈ పేరు వచ్చినట్లుగా ఒక కథనం. దీనికి నిదర్శనంగా ఇక్కడ ఉన్న శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి వారి ఆలయం. రెండవ కథనం ప్రకారం ఉడుపి అన్న పదం 'ఒడిపు' అన్న తుళు పదం నుండి వచ్చినది. దానికి అర్థం పవిత్ర గ్రామం. జగన్నాటక సూత్రధారి శ్రీకృష్ణుడు కొలువైన ప్రదేశం. ఉడుపి ద్వైత సిద్ధాంత సృష్టి కర్త అయిన శ్రీశ్రీశ్రీ మధ్వాచార్యుల జన్మస్థలం. పదమూడవ శతాబ్దంలో ఇక్కడ శ్రీకృష్ణ విగ్రహం ప్రతిష్టించి మఠాన్ని స్థాపించారు. అందుకు సంబంధించి ఆసక్తికర సంఘటన ఒకటి ప్రచారంలో ఉంది. మధ్వాచార్యులు సముద్ర తీరంలో నడుస్తుండగా దూరంగా అల్లకల్లోలంగా ఉన్న సాగరంలో ఒక నావ చిక్కుకొని పోయి అందులోని వారు ఆర్తనాదాలు చేస్తుండటం చూసారు. ఆయన వారికి మార్గదర్శకత్వం చేసి క్షేమంగా ఒడ్డుకు చేర్చారు. దానికి ఆ నావికులు కృతజ్ఞతగా ఆయనకి వారి వద్ద ఉన్న కృష్ణ బలరామ విగ్రహాలను బహూకరించారు. బలరామమూర్తిని దగ్గరలోని మాల్పే (వడపాండేశ్వర ఆలయం) అన్న చోట ప్రతిష్టించారు. సాగర తీరంలో నేటికి సందర్శించుకొనవచ్చు. కృష్ణ విగ్రహాన్ని ఉడుపిలో ప్రతిష్టించారు. ఈ విగ్రహాన్ని దేవశిల్పి విశ్వకర్మ రుక్మిణి దేవి నిత్య పూజ కొరకు ద్వాపరయుగంలో ప్రత్యేకంగా తయారుచేసినట్లుగా తెలుస్తోంది. ఉడుపిలోను చుట్టుపక్కల ఎన్నో దర్శనీయ స్థలాలు ఉన్నాయి.


**ఇలా వెళ్లవచ్చు:**

హైదరాబాద్ నుండి ఉడు పికి కారులో వెళితే 734.19 కిలోమీటర్లు ఉంటుంది. హైదరాబాద్ నుండి ఉడు పికి డైరెక్టుగా బస్సులు నడిపే టూరిజం సంస్థలు మూడు ఉన్నాయి. ఫ్లైట్‌లో అయితే హైదరా బాద్ నుండి మంగళూరు వెళ్లి అక్కడి నుండి ఉడుపికి ప్రైవేట్ ట్యాక్సీల్లో వెళ్లొచ్చు. ఫ్లైట్ టికెట్ ఒక్కరికి రూ.3200. ట్రైన్‌లో హైదరాబాద్ నుండి ఉడుపికి ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చు.

– ఇలపావ్లులూరి వెంకటేశ్వర్లు

# రోజూ బ్లూబెర్రీస్ తింటున్నారా?... అయితే క్యాన్సర్ ప్రమాదం తప్పినట్లే

ఇది రక్తంలో చక్కెరస్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది



బ్లూబెర్రీస్ విటమిన్లు, ఖనిజాలు, యాంటీఆక్సిడెంట్లు, డైటరీ ఫైబర్‌తో నిండిన అత్యంత పోషకమైన పండు. అవి అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్‌కు ప్రసిద్ధి చెందాయి, ఇవి అనేక వ్యాధుల నుండి శరీరాన్ని రక్షించడంలో సహాయపడుతుంది. చాలా అధ్యయనాలు బ్లూబెర్రీస్ మెరుగైన గుండె ఆరోగ్యం, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గించడం, మెదడు పనితీరు మెరుగు పరచడం, మెరుగైన రక్తంలో చక్కెర నియంత్రణకు సహాయపడతాయి.

**రోజూ బ్లూబెర్రీస్ తినడం అనేది ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుంది?**

రోజూ బ్లూబెర్రీస్ తినడం వల్ల ఆరోగ్యంపై అనేక సానుకూల ప్రభావాలు ఉంటాయి. రోజూ బ్లూబెర్రీస్ కడుపులో తినడం వల్ల మంట తగ్గుతుంది నిర్దిష్ట ఆరోగ్య ప్రయోజనాల దృష్ట్యా, బ్లూబెర్రీస్ రోజూ తినడం వల్ల శరీరంలోని వాపు తగ్గుతుంది. ఇందులోని అధిక యాంటీఆక్సిడెంట్ కంటెంట్ కారణంగా ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుంచి కణాలను రక్షించడంలో సహాయపడుతుంది.

1. బ్లూబెర్రీస్ తినడం వల్ల బరువు తగ్గడంలో సహాయపడుతుంది బ్లూబెర్రీస్‌లో డైటరీ ఫైబర్ అధికంగా ఉంటుంది, ఇది జీర్ణ ఆరోగ్యానికి తోడ్పడుతుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది.
2. బ్లూబెర్రీస్ తినడంతో మధుమేహం రాకుండా నిరోధించడంలో సహాయపడవచ్చు. బ్లూబెర్రీస్ మెరుగైన బ్లడ్ షుగర్ నియంత్రణ ఉంటాయి. ఎందుకంటే బ్లూబెర్రీస్ ఆంథోసైనిన్‌లను కలిగి ఉంటాయి, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.
3. మధుమేహం వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అదనంగా, బ్లూబెర్రీస్‌లో చక్కెర తక్కువగా ఉంటుంది.
4. డైటరీ ఫైబర్ అద్భుతమైన మూలం, ఈ రెండూ ఆరోగ్యకరమైన రక్తంలో చక్కెర స్థాయిలను అందించడంలో సహాయపడతాయి.
5. బరువు తగ్గాలని చూస్తున్నట్లయితే, అమెరికన్ డైటెటిక్ అసోసియేషన్ ప్రతిరోజూ 1/2 నుండి 1 కప్పు బ్లూబెర్రీస్ తినాలని సిఫార్సు చేస్తోంది. ఇది దాదాపు 75-150 గ్రాములు బ్లూబెర్రీస్‌కి సమానం.
6. బ్లూబెర్రీస్ పోషకాహారానికి గొప్ప మూలం అయితే, వాటిని ఇతర పండ్లు, కూరగాయల స్థానంలో తినకూడదు. రోజూ బ్లూబెర్రీస్ తినడం వల్ల ఆరోగ్యంపై అనేక సానుకూల ప్రభావాలు ఉంటాయి.

## తూకాల్లో తిరకాసేమి తిరుమలేశ

(మొదటి పేజీ తరువాయి)



ఏపీఎండీసీ నిధులతో సిమెంటు రోడ్లు, తాగునీటి పథకాలు ఏర్పాటు చేసింది. అంతటి సంస్థలో కొందరు వక్రబుద్ధితో అక్రమ ఆదాయానికి మార్గాలు చూపుతూ దారులు వెతుక్కుంటూ అక్రమాలకు తెరలేపుతున్నారు. అదికాస్త నేడు పరాకాష్టకు చేరుకుంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తేనే, పత్రికలలో వార్తలు ప్రచురితమైతే మొక్కుబడి చర్యలు తీసుకుంటున్నారు. ఆ తరువాత శరామామూలే. అవినీతి అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా ఉదాసీనంగా వ్యవహరించడమే ఇందుకు కారణమని పలువురు విమర్శిస్తున్నారు. వైద్య, ఆరోగ్య ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు, సిబ్బంది కార్మికులకు ఉచితంగా సంస్థనే నిధులను కేటాయించింది. ఇక్కడ అడ్డమార్గాల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. సంస్థ ఖజానాకు కోట్లాది రూపాయలు గండికొడుతున్నారనే ఆరోపణలు లేకపోలేదు. సంస్థలో పనిచేసే వారి పిల్లలతో పాటు పరిసర గ్రామాల పిల్లలకు నాణ్యమైన విద్య వైద్య సౌకర్యం కల్పిస్తోంది. కార్పొరేట్ స్థాయిలో పాఠశాల భవనాలు ఆకాశాన్ని అంటే విధంగా సుందరంగా అలరింపజేసి నిర్మించింది. తాను కూర్చున్న చెట్టు కొమ్మను తానే నరుక్కున్నట్లు సంస్థలోని కొందరు అక్రమార్కులతో అడ్డదారులు తొక్కి వారితో చేతులు కలిపారు. మాతృ సంస్థ మనుగడనే ప్రశ్నార్థకం చేస్తూ సంస్థకు మచ్చ తెస్తున్నారు. తాజాగా వే బ్రిడ్జీ వద్ద తూకాలు లేకుండానే బెరైటీస్ ఖనిజాన్ని కంప్యూటర్ మాయా జాలంతో పొలిమేర్లను దాటి వెళ్తున్నాయంటే ఇంటి దొంగల సహకారం ఏ స్థాయిలో ఉందో చెప్పకనే తెలుస్తోంది. ఏది ఏమైనా వేబ్రిడ్జీ కాటా వద్ద లారీలు తూకాలు వేసే

తూతూ పర్యవేక్షణ ...... తీగ లాగితే కదిలిన డొంక

- రోజుకో మకిలీ రోత ..... తప్పుల్ని కప్పిపుచ్చుకునేందుకు నానా తంటాలు
- సామాన్యుడి నోట.. అవినీతి మాట
- ఏపీఎండీసీ కాటా బ్రిడ్జీల వద్ద 9 నెలలుగా ఖనిజం మళ్లింపు వ్యవహారం
- పరిరక్షణ, పర్యవేక్షణ లోపాలతోనే అవినీతికి మార్గాలు

లీలలు డ్రైవర్లకు, అటు కంప్యూటర్ ఆపరేటర్లకు వెన్నతో పెట్టిన విద్య అని ఎక్కడ చూసినా ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు. కాటాల మాయాజాలంతో గత 9 నెలలుగా ఈ అక్రమ ఆదాయానికి అడ్డదారుల్లో కోట్ల రూపాయలు విలువ చేసే ఖనిజ సంపద ఏ గ్రేడ్ కెమికల్ తదితర ముగ్గురాయి ఖనిజం పక్కదార్లకు తరలి వెళ్లినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. ఈ విషయాన్ని అక్కడ పని చేసే అధికారులు, డ్యూటీలోని వారు ఐడీ లేకుండా 2, 3 రోజుల క్రితం డ్యూటీ దిగిన ఉద్యోగుల ఐడీలు మార్చి ఇక్కడ ఎంట్రీ చేసి ఆ తరువాత లోడు ఎత్తుకొని వెళ్లిన లారీలకు తిరిగి కాటా బిల్లు కొట్టకుండా డిలీట్ చేయడం ఇలా వేల టన్నులు ముగ్గురాయి ఖనిజం పొలిమేరలు దాటి వెళ్లినట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా తీగ లాగితే డొంక కదిలింది. ఇక్కడ పని చేసే వారిని ప్రశ్నిస్తే ఆశ్చర్యపోయే నిజాలు తేటతెల్లం అవుతున్నాయి. ఇక్కడ పనిచేసేఉన్నత స్థాయి అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వెరసి పరిరక్షణ, పర్యవేక్షణ లోపం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా సంబంధిత రాష్ట్ర ఉన్నతాధికారులు, బెరైటీస్ అధికారులు విజిలెన్స్ అధికారుల ద్వారా సీసీ పుటేజీని పరిశీలించి కంప్యూటర్ హిస్టరీని చేదిస్తే ఇంటి దొంగలు దొరికిపోతారని ఇలా గతంలో 2015-16 సంవత్సరాల్లో ఇలాంటి పరిస్థితే ఎదురైంది దీన్ని సున్నితంగా పరిష్కరించి నూతనంగా ఎన్నికైన సభ్యులే పని చేయడం ఈ అక్రమ ఆదాయానికి తెరలేపినట్లు తెలుస్తోంది. ఇంటి దొంగల సహకారంతో ఎంత పనైనా చేయవచ్చునని అంతే కాకుండా అనుకూల శత్రువు ఒక్కడు వంద మంది శత్రువులతో సమానమని అనుకూలంగా ఉంటూ అన్నం పెట్టిన సంస్థకే ద్రోహం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకొని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అంతేకాకుండా ఇక్కడ పనిచేసే ఉన్నతాధికారులు ముక్కుసూటిగా వ్యవహరించాలనే ఆరోపణలున్నాయి. తప్పు చేసిన వారిని వెనకేసుకురావడం లాంటి జరగడంతో చిన్న ఉద్యోగుల్లో కూడా విధుల పట్ల అంకిత భావం లేకుండా ఉందనే విమర్శలున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని ఈ అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## ప్రవీణ్ ప్రకాష్ తనిఖీలు ప్రచారం కోసమా?

ఉపాధ్యాయులను ఇబ్బంది పెడితే ఊరుకునేది లేదు: ఒంటేరు

ప్రొద్దుటూరు అర్బన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త

విద్యా శాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పాఠశాలల తనిఖీ కార్యక్రమం కేవలం ప్రచారం కోసమే చేస్తున్నట్లు స్పష్టమవుతోందని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. విద్యాసంవత్సరం ముగుస్తున్న సమయంలో ఈ తనిఖీలేమిటని ఆయన ప్రశ్నించారు. తనిఖీల సమయంలో ఉపాధ్యాయులు, అధికారులకు తగిన సూచనలిచ్చి ప్రోత్సహించాల్సింది పోయి అధికార దర్పంతో సస్పెండ్ చేయడమేమిటన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో ఉపాధ్యాయులకు లక్ష్యాలు నిర్దేశించి వాటి అమలుపై తనిఖీలు నిర్వహించాలే కాని ఇలా సమయం సందర్భం లేకుండా తనిఖీల పేరుతో హంగామా సృష్టించడమేమిటన్నారు. మీడియా ముందు, ప్రజల ముందు ఉపాధ్యాయులను నిందితులుగా చూపుతూ వారిని ప్రశ్నించడం ఉపాధ్యాయ వృత్తిని అవమానించినట్లవుతుందన్నారు. ఉపాధ్యాయు లపై బోధనేతర పనుల భారం వేస్తూ విద్యాబోధనకు సమయమే లేకుండా చేయడమే కాకుండా ఇప్పుడు తనిఖీల పేరుతో సస్పెండ్ చేయడం కక్షపూరిత చర్యే అని చెప్పారు. ఉపాధ్యాయులకు సకాలంలో వేతనాలు అందడంలేదని, డుఏలు, పీఆర్సీల రూపంలో తీవ్రంగా నష్టపోయారని, ఎస్జీటీలకు కొన్ని దశాబ్దాలుగా పదోన్నతులు లేవని, స్కూల్ అసిస్టెంట్లకు జె ఎల్ పదోన్నతులు కల్పన జరగలేదని ఒక ఉన్నతాధికారిగా ఈ సమస్యలను పరిష్కరించి వారికి అండగా నిలవాల్సింది పోయి , తనిఖీలంటూ ఇబ్బందిపెట్టడం భావ్యం కాదన్నారు. పని ఒత్తిడి వల్ల ఇటీవలి కాలంలో ఎందరో ఉపాధ్యాయులు గుండెపోటుతో మరణించారని, ఇకపై ఉపాధ్యాయులకు ఇబ్బంది కలిగించే చర్యలు చేపడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

## ప్రజల తాగునీటి కల నెరవేరింది

మైలవరం డ్యామ్ నుండి ప్రొద్దుటూరు నీటిశుద్ధి కేంద్రాలకు చేరిన నీరు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ప్రొద్దుటూరు ఏప్రిల్ 23, ప్రభాతవార్త



ప్రొద్దుటూరు పట్టణంలో 15 సంవత్సరాలుగా ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురి చేస్తున్న త్రాగునీటి సమస్య అధిగమించే క్రమంలో అమృత పథకం ద్వారా 120 కోట్లతో చేపట్టిన శాశ్వత త్రాగునీటి పనులు పూర్తయి మైలవరం డ్యామ్ నుండి ప్రొద్దుటూరు నీటి శుద్ధి కేంద్రాలకు ఆదివారం నీరు చేరడంతో ప్రజల త్రాగునీటి స్వప్నం నెరవేర్చడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక రెండు కులాల దగ్గర నిర్మించిన నీటి శుద్ధి కేంద్రాలకు చేరుకున్న ట్రయల్ రన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లతో నీటి శుద్ధి జరిగే విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గత చంద్రబాబు ప్రభుత్వ పాలనలో నిలిచిపోయిన 120 కోట్లతో చేపట్టిన అమృత్ పథకం పనులను వేగవంతం చేసి పొద్దుటూరు ప్రజలకు శాశ్వత త్రాగునీటి సమస్యను వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెరవేర్చినందుకు సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే ప్రతిరోజు ఒకసారి ప్రజలకు పరిశుభ్రమైన త్రాగునీరుని అందిస్తామన్నారు. తన రాజకీయ జీవితంలో ప్రొద్దుటూరు ప్రజలకు త్రాగునీటి సమస్య లేకుండా చేయాలన్నది తన స్వప్నమని పేర్కొన్నారు. అది తన పాలనలో నెరవేరుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ పథకం వల్ల ప్రొద్దుటూరు ప్రజలకు శాశ్వతంగా త్రాగునీరు అందుతుందని, శ్రీశైలం డ్యామ్ ఎండితే తప్ప ప్రొద్దు టూరు ప్రజల గొంతు ఎండదని తెలిపారు. గత టిడిపి పాలకమండలికి త్రాగునీటి కోసం ఎన్నోసార్లు ఉద్యమాలు చేసి విజ్ఞప్తి చేసినా నిర్లక్ష్యం వహించడంలో వారి చిత్తశుద్ధి బహిర్గతమైందన్నారు. వైసిపి పాలకమండలి అధికారం చేపట్టిన వెంటనే ఈ పథకం పూర్తి కావడానికి అహర్నిశలు శ్రమించిన మున్సిపల్ పాలకమండలి, పబ్లిక్ హెల్త్ అధికారులకు సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి మున్సిపల్ కమిషనర్ పీవీ రమణయ్య వైసిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నర సింహారెడ్డి వైసీపీ సీనియర్ నాయకులు కాకర్ల నాగశేషారెడ్డి కౌన్సిలర్లు భూమి రెడ్డి వంశీధర్ రెడ్డి ఇర్ఫాన్ భాష కమల్ భాష వైసిపి నాయకులు సూర్యనారాయణ పాల్గొన్నారు.

## పిల్లలు చదివేందుకు ఏ పుస్తకాలు ఎంచుకోవాలి



ఒకప్పుడు పిల్లలకు కథలు చెపుతుంటే 'ఊ' కొడుతూ పడుకునేవారు. ఇప్పుడు కథలు చెప్పే నాయనమ్మలు లేరిప్పుడు, విని 'ఊ' కొట్టే పిల్లలకూ తిరికలేదు. రోజంతా ఏదో హడావుడిగా గడిపేస్తూ చదువులో మునిగిపోతున్నారు ఇప్పటి పిల్లలు. అయితే ఒకటి మాత్రం ఎన్ని మార్పులు వచ్చినా పిల్లల్లో మారకుండా ఉంది. అదే కథల మీద ఆశక్తి. ఆ ఆశక్తితోనే కథలు చదివించుకుని ఆనందపడుతున్నారు ఇప్పటి పిల్లలు. ఒకరు మరొకరిలా ఎప్పటికీ ఉండరు. ప్రతి పిల్లలూ మరోకరితో భిన్నంగానే ఉంటారు. పుస్తకాలు చదవడం చాలా ఆరోగ్యకరమైన అలవాటు. ఇది ప్రపంచాన్ని అర్థం చేసుకునేలా మెదడును పెంచుతుంది. ఆత్మ విశ్వాసాన్ని పెంచి, జ్ఞానాన్ని నింపుతుంది. చిన్నప్పటి నుంచే పిల్లల్లో చదువును అలవర్చాలి. పిల్లలకు ఏది అలవాటు కావాలన్నా కూడా ముందు పెద్దలకు అలవాటు కావాలి. పిల్లలు ఏదైనా పెద్దలనుంచే నేర్చుకుంటారు. మరిచిపోకండి. వయస్సుకి తగిన పుస్తకాలతో చదవడం ప్రారంభించండి: పిల్లల వయస్సు, పఠన స్థాయికి తగిన పుస్తకాలను ఎంచుకోవాలి. మొదటగా చిన్న పిల్లల కోసం చిత్ర పుస్తకాలతో ప్రారంభించవచ్చు. వాళ్ళ ఆసక్తికి తగిన విధంగా పుస్తకాలను కొని ఇవ్వడం వల్ల రోజు రోజుకీ వాళ్ళల్లో చదవాలనే ఆసక్తి కలుగుతుంది. ఒక విధంగా రెట్టింపు అవుతుంది. చదవడం అనేది రొటీన్‌గా చేసుకోవాలి: నిద్రవేళకు ముందు లేదా రాత్రి భోజనం తర్వాత పుస్తకాలను చదవడం కోసం కొద్దిగా సమయాన్ని ఉంచుకోవాలి. ఇలా అలవాటు చేయడం వల్ల ఆసక్తిగా రోజూ అదే సమయానికి పుస్తకం ముందు కూచుంటారు పిల్లలు. ఆసక్తి కలిగించే విషయాలపై పుస్తకాలను ఎంచుకోవాలి: పిల్లలు ఆసక్తిని కలిగించే అంశం ఏదై ఉంటుందో అవే పుస్తకాలను చదవడానికి ఎంచుకుంటే త్వరగా చదవడానికి ఆసక్తిని చూపుతారు. పిల్లలు డైనోసార్‌లను ఇష్టపడితే, ఉదాహరణకు, వాటి గురించిన పుస్తకాలను కనుగొనండి. వారు క్రీడలను ఇష్టపడితే, వారికి ఇష్టమైన క్రీడ లేదా అథ్లెట్ గురించి పుస్తకాలను కనుగొనండి.

**కలిసి చదవండి:** : ఒక వేళ అంతా కలిసి చదివే వీలున్న రోజుల్లో కుటుంబంతో కలిసి చదవడానికి సమయాన్ని వెచ్చించండి. కథను బిగ్గరగా చదవడం, చర్చించడం వంటివి పిల్లలు ఇష్టపడే విషయాలు. ఇవి పుస్తకాలను చదివే ఆసక్తిని, నైపుణ్యాలను పెంపొందించడంలో సహాయపడటమే కాకుండా పెద్దలకు, పిల్లలకు మధ్య స్నేహ బంధాన్ని ఏర్పరుస్తుంది.

**రివార్డు చేయండి :** స్క్రీన్ సమయం తగ్గించుకుని పుస్తకాలను చదివేందుకు ఆసక్తి చూపుతున్న మీ పిల్లలకు రివార్డ్‌లను ఆఫర్ చేయండి. ఇది వారికి చదవడానికి ప్రోత్సాహాన్ని ఇస్తుంది. వాళ్లకు నచ్చే పుస్తకాలే కాదు, పెన్నులు, చిన్న చిన్న డైరీలను కూడా తెచ్చి ఇవ్వడం వల్ల పిల్లలకు చదివిన పుస్తకాల గురించి పుస్తకంలో లేదా డైరీలో రాసుకునే అలవాటు దానంతట అదే అలవడుతుంది. మరెందుకు ఆలస్యం ఇలా చేసి పిల్లలకు పుస్తకాల అలవాటు చేయండి.

## భక్తుల కొంగు బంగారం శ్రీ రెడ్డెమ్మతల్లి

గుర్రంకొండ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త



చెర్లోపల్లెలో వెలసిన శ్రీరెడ్డెమ్మతల్లి భక్తులకు కొంగు బంగారంగా దర్శనమిస్తోంది. ఈ ఆలయంలో ప్రతి ఆది, గురువారాలలో భక్తుల సందడి ఎక్కువగా వుంటుంది. ఉదయం నుండీ భక్తులు, పుష్కరిణిలో స్నానమాచరించి తమ మొక్కులను చెల్లించుకొన్నారు. సంతానం కావాల్సిన మహిళలు తడిగుడ్డలతో గర్భ గుడి ముందు పొర్లు దండాలతో రెడ్డెమ్మతల్లికి మొక్కుకోవడం జరిగింది. సంతానం కలిగిన మహిళలు అమ్మవారికి కానుకలుగా వెండి విగ్రహాలు, బంగారు నగలు, నగదు, చీర, సారెలు ఇస్తుంటారు. ఇక్కడి ప్రత్యేకత ఏంటంటే ముస్లింలు సైతం ఈ ఆలయానికి వచ్చి మొక్కుకోవడం జరుగుతుంది. ముస్లింలకు సంతానం కలిగినవారు రెడ్డితోవచ్చే అక్షరాలతో పేర్లుపెట్టుకొంటుంటారు. దీంతో ఆలయ ప్రాముఖ్యత మరింత పెరిగి ప్రజలు మన రాష్ట్రం నుండీనేకాక పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండీ భక్తులు రావడం జరిగుతోంది. ఉదయం నుండీ ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృత అభిషేకం, అమ్మవారికి సర్వాంగ సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఛైర్మన్ నరసింహారెడ్డి, ఇఒ మంజుల పర్యవేక్షించారు.

## నేడు శ్రీ క్రిష్ణదేవరాయుల విగ్రహావిష్కరణ

మదనపల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



పట్టణంలోని మల్లికార్జున సర్కిల్‌లో సోమవారం శ్రీక్రిష్ణదేవరాయుల విగ్రహావిష్కరణ చేపట్టనున్నట్లు పట్టణ బలిజసంఘం అధ్యక్షులు బిపిఎల్ విజయకుమార్ తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, టిటిడి బోర్డుసభ్యులు పోకల అశోక్‌కుమార్‌లచే విగ్రహావిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఆయన తెలిపారు. బలిజ సేవాసమితి నాయకుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ జింకా వెంకటాచలపతి, నాయకులు జంగాల శివరామ్, విజయభాస్కర్, పెట్రోల్ బంకు సరేంద్ర, రాజభవన్ రాజా తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళతా

జనసేన నాయకులు రాందాస్‌చౌదరి

మదనపల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



గ్రామీణ ప్రాంతాల్లో ప్ర జల ఎదుర్కొంటున్న సమస్య లపై ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్ళి పరిష్కారానికి చర్యలు తీసుకొంటానని జనసేన పార్టీ రాయలసీమ కోకన్వీనర్ గంగారపు రాందాస్ చౌదరి తెలిపారు. ఆదివారం రూరల్ మండలంలోని కోళ్ళబైలు గ్రామ పంచాయితీ పరిధిలోని బృందావనం కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు పలు సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్ళుగా ఈ ప్రాంతంలో ప్రజలు రోడ్లు, మురుగనీటి కాలువలు, నీటి ఎద్దడితో ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు కాని, అధికారులు కాని పట్టించుకొన్న పాపాన పోలేదన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్ళి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వైకాపా ప్రభుత్వం ప్రజాసమస్యలను పూర్తిగా విస్మరించింద న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జగదీష్, కుమార్, రెడ్డమ్మ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా గాండ్లసంఘం అధ్యక్షులుగా బండపల్లె వెంకటరమణ

మదనపల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



అన్నమయ్యజిల్లా అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా బండపల్లె వెంకటరమణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రాష్ట్ర నాయకులు గోపాల్‌రావు, చెంచురామయ్య, కిషోర్‌కుమార్, కార్పోరేషన్ ఛైర్మెన్ భవానిప్రియల ఆధ్వర్యంలో సంఘం ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గౌరవ అధ్యక్షులుగా ఆర్‌కె.లక్ష్మీరమణ, కార్యదర్శిగా ఎం.వెంకటరమణ, కోశాధికారిగా శ్రీధర్, ఉపాధ్యక్షులుగా మంచూరి జయరామ్, భద్రీ వెంకటరమణ, బి.శంకర్, జంగయ్య, బద్రీ ప్రసాద్, సంయుక్తకార్యదర్శులుగా కె.వెంకటసుబ్బయ్య, టి.చంద్రశేఖర్ పోతబోలు వెంకటేష్, టి.శ్రీనివాసులు, గౌరవ సలహాదారులుగా పి.సురేష్‌బాబు, పి.ప్రకాష్‌రావు, కొండయ్యలతో పాటు 17మంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

## చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఐ, సిపిఎం నాయకులు డిమాండ్

మదనపల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం, సిపిఐ నాయకులు కోరారు. ప్రచారబేరి కార్యక్రమంలో భాగంగా 10వ రోజు ఆదివారం నీరుగట్టువారిపల్లెలో కొనసాగించారు. ఈ సందర్భంగా నాయకులు మురళి, ప్రభాకర్‌లు మాట్లాడుతూ ముడి పదార్థాల ధరలను తగ్గించి ప్రభుత్వం చేనేతలకు అండగా నిలవాలన్నారు. వస్త్ర ఉత్పత్తులపై జిఎస్‌టి 5శాతం నుంచి 12శాతంకు పెంచడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధం అవుతోందన్నారు. దేశ వ్యాప్తంగా చేనేతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతల ఉత్పత్తులపై జిఎస్‌టిని పూర్తిగా రద్దు చేసి ఆదుకోవాలన్నారు. అదేవిధంగా నీరుగట్టువారిపల్లె పట్టుచీరలకు ప్రభుత్వం గుర్తింపు తెచ్చి గిట్టుబాటుధరలుకల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవి, రెడ్డప్ప, తిరుమల, దేవా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాభివృద్ధికి టిడిపి నాయకులు చేయూత

మదనపల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :



నియోజకవర్గంలోని రామసముద్రం మండలం అరికెలలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి టిడిపి నియోకవర్గ నాయ కులు శ్రీరామనేని జయరామ్‌నాయుడు రూ.50వేలు విరాళంగా అందజేశారు. ఆదివారం ఆయన నివాసంలో ఆ గ్రామ ప్రజలకు విరాళ నిధులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి తన సొంత నిధులు ఇవ్వడం అనందంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి నాయకులు వేణు, మోహన్, మహదేవ, పెంచుపాడు స్వామి పాల్గొన్నారు.

## నీటిట్యాంకులో పడి మహిళ మృతి

మదనపల్లెక్రైం, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :



నీటి ట్యాంకులో పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన శనవారం రాత్రి పిటిఎం మండలంలో చోటు చేసుకొంది. మండలంలోని మల్లెల పంచాయతీ ఉప్పురోళ్ళపల్లెకు చెందిన అప్పిరెడ్డి భార్య జి.లక్ష్మిదేవి(35) వ్యవసాయం పనులు చేస్తుండేది. ఈమెకు కుమారుడు కలడు. ఈ నేపధ్యంలో పనులు చేసేందుకు శనివారం పొలం వద్దకు వెళ్ళింది. దామం వేస్తుండడంతో పక్కనే పొలంలో ఏర్పాటు చేసిన ట్యాంకులో బాటిల్‌కు నీళ్ళు పట్టుకునేందుకు వెళ్ళింది. ఈ క్రమంలో నీరు పటుటకుంటుంగా కాలుజారడంతో అదుపుతప్పి ట్యాంకులో పడిపోయింది. పొలం వద్ద ఎవరూ లేకపోవడంతో మృత్యువాతపడింది. పొలం వద్దకు వెళ్ళిన లక్ష్మిదేవి రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చి పొలంవద్దకు వెళ్లిచూడగా నీటి ట్యాంకులో శవమై తేలింది. అనంతరం ఘటనపై పిటిఎం పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీయించి విచారించారు. కాలుజారీ నీటిట్యాంకులో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పిటిఎం పోలీసులు చెప్పారు.

## గర్నిమిట్ట యల్లమ్మదేవత సోలెం మెరవణి ప్రారంభం

కేవి.పల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్తః



మండలంలోని గర్నిమిట్టలో వెలసిన శ్రీగర్నిమిట్ట యల్లమ్మ దేవత తిరుణాల మే 4 నుంచి జరుగు సందర్భంగా తిరుణాల ముందు అమ్మవారి ఉత్సవ విగ్రహాలను కేవి.పల్లె గర్నిమిట్ట పంచాయతీలలో పల్లెల్లో నగరోత్సవం నిర్వహించడం ఆనవాయతీగా వస్తున్నది. ఈసందర్భంగా ఆదివారం యల్లమ్మదేవత ఆలయంలో ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి ప్రత్యేకంగా అలంకరించి పూజలు జరిపారు. డప్పువాయిద్యాల మద్య ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ గజ్జల శ్రుతి, ఆలయ ధర్మకర్త సుబ్బమ్మ, సర్పంచి రమణమ్మ, ఉపసర్పంచి వేణుగోపాల్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచి మృతికి ఎమ్మెల్యే హరీష్‌రెడ్డి నివాళి

వాల్మీకిపురం, ఏప్రిల్ 23 ప్రభాతవార్తః



మండలంలోని గండబోయినపల్లె మాజీ సర్పంచి మోహనరెడ్డి మతదేహానికి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఏపీ ఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి నివాళులు అర్పించారు. మృతుని స్వస్థలం గండబోయినపల్లె పంచాయతీ కొత్తకురవపల్లెలో మాజీ సర్పంచి మతదేహాన్ని సందర్శించి ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. సర్పంచి ప్రజలకు విశేష సేవలు అందించారని మోహన్‌రెడ్డి మరణం పార్టీకి తీరనిలోటు అని పేర్కొన్నారు. అలాగే వారి కుమారులు రమేష్‌రెడ్డి, రెడ్డి ప్రసాద్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యేవెంట స్థానిక నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, కిట్ట, ఖాసీంసాబ్, మౌలా, నవాజ్, సదామ్, ముబారక్, రాజన్న, శీనా తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సైగా నాగేశ్వరరావు పదవీ బాధ్యతలు

వాల్మీకిపురం, ఏప్రిల్ 23 ప్రభాతవార్తః



ఎస్సైగా నాగేశ్వరరావు ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. రాయచోటి నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న బిందుమాధవి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన ఎస్సై మాట్లాడుతూ పట్టంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం పనిచేస్తామని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు వచ్చిన నేరుగా తమ వద్దకు వచ్చి ఫిర్యాదులు చేయవచ్చునని తెలియజేశారు. ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటామని చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

## నేటి బాలలే రేపటి పౌరులు

కేవి.పల్లె, ఏప్రిల్ 23 ప్రభాతవార్తః



నేటి బాలలే రేపటి పౌరులని విశ్రాంత ఎంఈఓ ఆదినారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని గర్నిమిట్టలో గల పార్ధ ఇంగ్లీషుమీడియం స్కూల్‌లో 18 వ వార్షికోత్సవం జరిగింది., ఈకార్య క్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని ఉన్నత శిఖరాలకు ఎదగాలని సమాజంలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈసందర్భంగా పాఠశాల విద్యార్తులు సాంస్కతిక కార్య క్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో గర్నిమిట్ట వైద్యాధికారి శ్యామల, సురేంద్రబాబు, జనార్ధన్‌రెడ్డి, వెంకటరమణ పాఠశాల సిబ్బంది విద్యార్తుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేషనల్ సర్వీస్ ప్రత్యేక క్యాంప్ కార్యక్రమాలు విజయవంతం

– ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఎన్.సరిత

కలికిరి, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:



కలికిరి జేఎన్‌టీయూ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రోగ్రాం ఆఫీసర్ డా.ఎన్.సరిత ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న నేషనల్ సర్వీస్ ప్రత్యేక క్యాంప్ కార్యక్రమాలు విజయవంతమయ్యాయి. నేషనల్ సర్వీస్ ప్రత్యేక క్యాంప్‌లలో భాగంగా గంగబోయినపల్లి పాఠశాలలో పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యంపై శ్రద్ధ సారవంతమైన భూమి ప్రాముఖ్యతపైన విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అదే విధంగా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గ్రామాల్లో రైతులకు విద్యుత్తు ఆదాపై వ్యవసాయ సాగుపై మెళకువల గురించి అవగాహన కల్పించారు. గంగబోయినపల్లి ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటారు. గతవారం రోజులుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టడంతో ఆదివారం కార్యక్రమంతో విజయవంతంగా ముగిసింది. చివరిరోజున విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి ఆటల ప్రాముఖ్యతను వివరించి విజేతలకు ఎన్ఎస్ఎస్-2 ప్రోగ్రాం ఆఫీసర్, డా.ఎన్.సరిత బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పద్మావతి హాస్పిటల్ డా.శివయోగి సోమశేఖర్, జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు కోట్లతో రెడ్డెమ్మకొండ ఆలయ అభివృద్ధి

ఆలయ ఛైర్మన్ నరసింహారెడ్డి

గుర్రంకొండ, ఏప్రిల్ 23, ప్రభాతవార్త



సంతాన ప్రధాయిని అయిన శ్రీ రెడ్డెమ్మతల్లి ఆలయ అభివృద్ధి రెండు కోట్లతో పనులు ప్రారంభించినట్లు ఆలయ ఛైర్మన్ నరసింహారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఆలయ ఛైర్మన్ నరసింహారెడ్డి ప్రభాతవార్తతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి అహర్నిసలు కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ప్రాంగణంలో చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. రెడ్డెమ్మతల్లి ఖాతాలో నగదు రూ. 57,25,557లు, ఎఫ్‌డిఆర్‌లో రూ.62,78,393లు, బంగారు 649 గ్రాములు, వెండి 26.974 కిలోలు, గోల్డ్ డిపాజిట్ స్కీమ్ క్రింద 643' 153గ్రాములు వున్నట్లు తెలిపారు. ఆలయంలో అభివృద్ధి పనులు క్రింద పునర్నిర్మానము క్రింద ఒకటిన్నరకోటి. సిజియఫ్ క్రింద రూ.30,00,000లు, పుష్కరిణి పునర్నిర్మాణము క్రింద రూ. 25,00,000లు, సిజియఫ్ క్రింద రూ. 5,00,000లు, రోడ్డు పనుల క్రింద రూ. 10,00,000లు, టాయిలెట్ బ్లాక్‌కి రూ. 20,00,000లు వెచ్చిస్తున్నట్లు ఆయన తెలిపారు.

## పీలేరు నుంచి చెన్నైకు నూతన సర్వీసు ప్రారంభం

పీలేరు, ఏప్రిల్ 23ప్రభాతవార్తః

పీలేరు నుంచి చెన్నైకు నూతన సర్వీసును ప్రారంభిస్తున్నట్లు డీఎం బండ్లకుమార్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.పీలేరు నుంచి తిరుపతి మీదుగా చెన్నైకు నూతన సర్వీసును సోమవారం నుంచి ప్రారంభించబడును , ఈసర్వీసు పీలేరులో ఉదయం 6గంటలకు బయలుదేరి తిరుపతి , పుత్తూరు, పిచ్చాటూరు, నాగలాపురం, ఊతుకోట, పెరియపాలెం మీదుగా చెన్నైలోని మాధవరంకు 11.45గంటలకు చేరును. తిరిగి చెన్నైలో 1.00గంటకు బయలుదేరి సాయంత్రం 6.15గంటలకు పీలేరుకు చేరుతుంది. కావున పీలేరు పరిసర ప్రాంత ప్రజలు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

## సేవా కార్యక్రమాలకు తుమ్మలపెంట సురేష్ బాబు కృషి సంతోషకరం

– మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ

బద్వేలు అర్బన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :



బద్వేలు ప్రాంతంలోని అనాధ వృద్ధులకు, అనాధ పిల్లలకు చేయూతనివ్వడంలోనే కాకుండా నిరుపేద కుటుంబాలలోని పేద ఆర్యవైశ్యులకు వారి వంతు సహాయ సహకారాలు అందజేయడంలో తుమ్మలపెంట సురేష్ బాబు కుటుంబ సభ్యుల సేవలు అభినందనీయం అని ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ, వనిత క్లబ్ మాజీ సెక్రటరి బెస్తవేముల నాగ శిరీష, వల్లంకొండు ధనలక్ష్మి, జొన్నలగడ్డ రాధతో పాటు పలువురు అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని అక్షయ తృతీయ సందర్భంగా ఆదివారం మైదుకూరు రోడ్‌లోని చలివేంద్రం వద్ద సుమారు 500 మందికి పైగా మజ్జిగ వితరణ కార్యక్రమాన్ని తుమ్మలపెంట సురేష్ బాబు, సతీమణి జయప్రదాదేవి, వారి కుమారులు సాయి శరణ్, రామకృష్ణ సృజన్ కుటుంబ సభ్యుల సహకారంతో మజ్జిగ వితరణ చేశారు. ఈ సందర్భంగా మహిళా మండలి అధ్యక్షురాలు చింతకుంట ధనమ్మ, ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటీ మెంబర్ జొన్నలగడ్డ సుధాకర్, వాసవీ క్లబ్ సెక్రటరి పెసల సుధాకర్ లు మాట్లాడుతూ బద్వేలు పట్టణంలో నిరుపేద ఆర్యవైశ్యులకు ఏ సమస్య వచ్చినా వారిని ఆదుకునే విధంగా తుమ్మలపెంట సురేష్ బాబు కుటుంబ సభ్యులు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ముఖ్యంగా షాలోమ్ అనాధాశ్రమంలోని తల్లి, తండ్రి లేని అనాధ పిల్లలకు, అనాధ వృద్ధులతో పాటు సోన్ పాపిడి వ్యాపారస్తుడైన బాబురావు కుటుంబానికి చేయూతనివ్వడంలో వారు ఎంతగానో కృషి చేశారన్నారు. అలాగే వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చే విధంగా మజ్జిగ వితరణ కార్యక్రమానికి కూడా సహకరించడం సంతోషకరం అని వారి సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ముచ్చర్ల సత్యనారాయణ, సతీమణి సరస్వతి, అనిల్ క్రిష్ణ, పత్తి హరీష్, సుబ్రమణ్యంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సత్రం ఆక్రమణకు ప్రయత్నం

అట్లూరు, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :



మండలంలోని అట్లూరు గ్రామానికి చెందిన యాదవ వంశస్థులు, మహాయోగి పుంగవులు శ్రీ అడివయ్య స్వాముల వారు ఆ కాలంలో బాటసారుల సౌకర్యార్థం అట్లూరు క్రాస్ రోడ్ నందు ఒక సత్రాన్ని నిర్మించడం జరిగింది. ఆ సత్రం నేడు కొందరు వ్యక్తులు సత్రం ఆవరణలో టిఫెన్ సెంటర్లు, కిరాణా షాపులు, ఇతర దుకాణాలు నడుపుకుంటూ సత్రానికి సంబంధించిన 8 సెంట్లు స్థలాన్ని కబ్జా చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. సత్రాన్ని నిర్మించింది ప్రజలు విశ్రాంతి తీసుకోవడం కోసమా? అక్రమార్కులు వ్యాపారాలు చేసుకోవడం కోసమా? అని మండల ప్రజలలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే సంత్రంలో ఉన్న దుకాణాలను ఖాళీ చేయించి సత్రాన్ని ప్రజల సౌకర్యార్థం ఉపయోగించే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## లోహిత్‌కుమార్ మృతి పట్ల సంతాపం తెలిపిన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

సంబేపల్లె, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:



సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లె గ్రామం బంగారువాండ్లపల్లెకు చెందిన లోహిత్ కుమార్‌రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బెంగళూరులో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. ఆదివారం జరిగిన లోహిత్ కుమార్‌రెడ్డి అంత్యక్రియలలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అతని మృతి పట్ల సంతాపం తెలిపి వారి కుటుంబ సభ్యులను శ్రీకాంత్‌రెడ్డి ఓదార్చారు. డీసీఎంఎస్ మాజీ ఛైర్మన్ ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల వైఎస్ఆర్‌సీపీ నాయకులు గొర్ల రమేష్‌రెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ నాగరాజు యాదవ్, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు వాసుదేవరెడ్డి తదితరులు నివాళులు అర్పించారు.

## చంద్రబాబు దాడిపై సీబీఐ లేక ఎంఐతో విచారణ జరిపించాలి

కడప వైద్యవిభాగం, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:



ఒక పథకం ప్రకారం ఎర్రగొండపాలెంలో చంద్రబాబుపై దాడి చేసిన వారిపై సీబీఐతో లేక ఎంఐతో విచారణ జరిపించాలని అలాగే రాళ్ల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కడప సిటీ ఉపాధ్యక్షులు కొండ సుబ్బయ్య డిమాండ్ చేశారు. ఎన్ఎస్‌జీ సెక్యూరిటీ ఉన్న మాజీ సీఎం చంద్రబాబును అంతమొందించే ప్రయత్నం జరుగుతోందని మా అనుమానమని దీనిపైన లోతైన విచారణ సీబీఐతో లేక ఎస్సైతో విచారణ చేయించాలని కేంద్ర హోం శాఖ అయినటువంటి అమిత్‌షాను మేము కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నాదెళ్ల దస్తగిరి 47వ డివిజన్ ఇన్‌ఛార్జి జనార్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డు నందు బండలాగుడు పోటీలు

కడప కార్పొరేషన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:



మార్కెట్ యార్డు నందు ఖాసీంవలీ, రాయలసీమ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో బండలాగుడు పోటీలను మార్కెట్ యార్డు ఛైర్మన్ బంగారు గంగాదేవి మార్కెట్ యార్డు డైరెక్టర్‌లు బంగారు నాగయ్య, పల్లెకొండు సంపత్, రామకృష్ణలు పోటీలు ప్రారంభించారు. గెలుపొందిన ఎద్దుల యజమానులకు మార్కెట్ యార్డు డైరెక్టర్ పల్లెకొండు సంపత్, నిర్వాహకులు ఖాసీం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ పండగ పురస్కరించుకొని మార్కెట్ యార్డు నందు ఒంటెద్దు బండి బండ లాగుడు పోటీలు నిర్వహించడం మంచి పరిణామమన్నారు. హమాలీలను, కార్మికులను ఈ పోటీలు ఉత్సాహపరిచాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సుశీలమ్మ, జయశ్రీ, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## జనసంద్రంగా శిల్పారామం

కడప కార్పొరేషన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:




శిల్పారామం తిరునాళ్లగా మారింది. చిన్న, పెద్దలు ఎంతో హాయిగా తమ కుటుంబాలతో శిల్పారామంలో సరదాగా గడిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు మిస్బా మూవి పద్మాకర్ బృందం వారి విద్యార్థులు పలు జానపద గీతాలు, హాస్యనాటకాలు, శాస్త్రీయ గీతాలు మరియు హిందీ సినిమా పాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో శిల్పారామం పర్యవేక్షణాధికారి పి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు.

## చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి : సోమిశెట్టి మనోహర్‌బాబు

ఒంటిమిట్ట ఏప్రిల్ 23 ప్రభాతవార్త:



ఈ నెల 24 వతేదీన విజయవాడలో లోనిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజంపేట కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి సోమిశెట్టిమనోహర్‌బాబు పిలుపునిచ్చారు. రాహుల్‌గాంధీ పైగదచిన నాలుగు నెలలుగా బిజెపి చేస్తున్న ముప్పేటదాడిని ఖండిస్తూ ఆదానీ మెదీ ల చీకటి మైత్రిని ప్రజలకు వివరిస్తూ రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీ ఆద్వర్యంలో ఆ నెల 24 వతేదీన విజయవాడలోని జింఖానా వైదానంలో జైబారత్ సత్యాగ్రహ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజలు నాయకులుస్వచ్ఛందంగా హాజరు కావలని తెలిపారు. కార్యక్రమంలో మండలపార్టీ ఆద్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అతిగా వాడకం చేటు



పొద్దున్నే నిద్ర లేపటానికి అలారమ్, ఆ తర్వాత వరుసపెట్టి మిత్రుల నుండి, వాట్సాప్ గ్రూప్‌ల నుండి గుడ్ మార్నింగ్ మెసేజ్‌లు, ఇన్‌బాక్స్‌కి వచ్చే మెయిల్స్, యాప్స్ నుంచి వచ్చే నోటిఫికేషన్లు ఇలా నిరంతరం ఏదో ఒక శబ్దం ఫోన్ నుండి వినిపిస్తూనే ఉంటుంది. అలాగే స్క్రీన్ కొద్ది క్షణాలు ఆన్ అయి దానంతట అది ఆఫ్ అవ్వతూ ఉంటుంది. మన బిజీ జీవితాలను నిర్వహించుకోవడానికి, రిలేషన్స్ మెయింటైన్ చేసుకోవడానికి ఇదంతా తప్పనిసరి అనుకుంటుండగానే వాస్తవానికి దీనివల్ల మన బ్రెయిన్ ఎంత ఇబ్బంది పడుతుందో ఎప్పుడూ ఆలోచించం. స్మార్ట్‌ఫోన్ల మీద గడిపే చాలా మంది తాము ఒకేసారి పలు పనులు చేస్తున్నట్లు భ్రాంతికి గురవ్వతూ ఉంటారు. చాలా మంది యువతలో తరచూ ఫేస్‌బుక్ చెక్ చేసుకోవడం పరోక్షంగా డిప్రెషన్‌కి కారణం అవ్వతోందని తెలుస్తోంది. అలాగే ఫేస్‌బుక్ లైక్‌లు, కామెంట్లకి అతిగా స్పందించటం, వాటి కోసం తాపత్రయపడటం కూడా మానసికమైన ఒత్తిడి పెంచుతోంది. తరచూ సెల్ఫీలు తీసుకోవడం, వాటిని అప్‌లోడ్ చేసి, వాటికి భారీ మొత్తంలో లైక్‌లు వస్తే తమతో పాటు ప్రపంచం ఉందన్న భావనా. ఎవరూ పెద్దగా పట్టించుకోకపోతే తమతో ఎవరూ లేరనే ఆత్మన్యూనత పెరిగిపోతున్నాయి. స్మార్ట్‌ఫోన్లు, సోషల్‌మీడియా విపరీతంగా వాడుతున్న వారు తమ ప్రయారిటీలు సెట్ చేసుకోవడం విషయంలో విఫలమవ్వతున్నారు.

## బద్వేలులో ఘనంగా వార్త దినపత్రిక ఈడి జన్మదిన వేడుకలు

**వృద్ధులకు అల్పాహారం, పండ్లు, తినుబండారాలు వితరణ**

**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**



వార్త తెలుగు జాతీయ దినపత్రిక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడి) శ్రీ గౌరవ్ సంఘీ జన్మ దినోత్సవం పురస్కరించుకొని ఆదివారం తెల్లవారుజామునే శ్రీ వేంకటేశ్వర స్వామి, అభయాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. అనంతరం వార్త సర్క్యులేషన్ సీనియర్ మేనేజర్ నూమర్సు వెంకటేశ్వరరావు, స్టాఫ్ రిపోర్టర్ భూమిరెడ్డి వెంకటేష్, అర్బన్ రిపోర్టర్ వల్లంకొండు వెంకటరమణ ఆధ్వర్యంలో బద్వేలు పట్టణంలోని ఆనంద నిలయంలో ఉండే అనాధ వృద్ధులకు, సుమిత్రా నగర్‌లో ఉండే షాలోమ్ చిన్న పిల్లల అనాధాశ్రమంలో తల్లి, తండ్రి లేని అనాధ పిల్లలకు పండ్లు రకాలు, తినుబండారాలు, స్వీట్లు అందజేసి ప్రత్యేక కేక్ కట్ చేసి అనాధ వృద్ధులకు, అనాధ పిల్లలకు తినిపించి, అనంతరం ఈడి గౌరవ్ సంఘీకి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి మానుగుంట రవి శంకర్, సీనియర్ ఉపాధ్యాయుడు ప్రభలవీటి వెంకట రమణ, మార్కెట్ యార్డు డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, అమ్మ డ్రైవింగ్ స్కూల్ అధినేత కాల్వ నాగరాజు మాట్లాడుతూ పత్రికా రంగంలో వార్త ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గౌరవ్ సంఘీ వినూత్న ఒరవడి సృష్టించి ప్రజా సమస్యలను అధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా వార్త దిన పత్రిక దిన దినాభివృద్ధి చెంది ప్రజలలో చెరగని ముద్ర వేసుకుందన్నారు. వార్త ఈడి గౌరవ్ సంఘీ ఇటువంటి జన్మ దినోత్సవాలు మరెన్నో జరుపుకొని సుఖ సంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు. పత్రికా రంగంలో రాబోవు రోజులలో కూడా మరింత అభివృద్ధి చెందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ సర్వేయర్ వర ప్రసాద్, బండారు సురేష్ బాబు, పత్తి హరీష్, షాలోమ్ అనాధాశ్రమ నిర్వాహకులు దేవసుధ, ఆనంద నిలయం వసతి గృహ మేనేజర్ పిడతల రవి కుమార్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## ప్రభుత్వ బంగళాన ఖాళీ చేయడం ఒక్క లెక్కకాదు

**పులివెందుల, ఏప్రిల్ 23, ప్రభాతవార్త :**



ప్రధానమంత్రి పదవినే త్యాగం చేసిన రాహుల్‌గాంధీకి ప్రభుత్వ బంగళాను ఖాళీ చేయడం ఒక లెక్క కాదని కాంగ్రెస్ రాష్ట్ర మీడియా ఛైర్మన్ డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కోట్లాది భారతీయుల హృదయాలే రాహుల్ గాంధీ సదనాలన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, బీజేపీ కక్ష రాజకీయాలు రోజురోజుకు ఎక్కువైపోతున్నాయన్నారు. రాహుల్ ముత్తాత మోతిలాల్‌నెహ్రూ దేశం కోసం కోట్లరూపాయలఆస్తులను దానం చేశారన్నారు.

**– ఆదిమూలపు సురేష్‌ను భర్తరఫ్ చేయాలి :**

శుక్రవారం ఎర్రగొండపాలెంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కాన్వాయ్‌పై వైకాపా శ్రేణులు దాడులు చేయడం దుర్మార్గం, అప్రజాస్వామికం అని తులసిరెడ్డి అన్నారు. మంత్రి ఆదిమూలపు సురేష్ నడిరోడ్డుపై చొక్కా విప్పి వీధిరౌడీలా వీరంగం చేయడం సిగ్గుచేటు అన్నారు.

## అంగరంగ వైబవంగా మాతమ్మ తిరుణాల

**గాలివీడు, ఏప్రిల్ 23ప్రభాతవార్త:**



మండలంలోని అలకాన్ చెరువు హరిజనవాడలో వెలసినటువంటి మాతమ్మ తెరుణాల శనివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. గాలివీడు ఆలయాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అలకాన్ చెరువు గ్రామ ప్రజల సహకారంతో రాత్రి విద్యుత్ దీపాలతో అలంకరించిన చాందినీ బండ్లు కట్టి అమ్మవారి మొక్కు తీరుకున్నారు. ఆదివారం చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున అమ్మవారికి బోనంఎత్తి సాంప్రదాయ పద్ధతిలో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, అలాగే మండల స్థాయి నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడం పట్ల ఆలయ కమిటీ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## వీధి కుక్కల నివారణకు ప్రత్యేక డ్రైవ్

**రాయచోటి టౌన్, ఏప్రిల్ 23ప్రభాతవార్త:**



ఇటీవల దేశంలోని పలు రాష్ట్రాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లో వీధికుక్కలు బాటసారులపై, చిన్న పిల్లపై దాడులు చేసిన నేపథ్యంలో ఆదివారం రాయచోటి మున్సిపల్ అధికారులు పట్టణంలో ఇలాంటి ఘటనలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. మున్సిపల్ కౌన్సిల్, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో తిరుపతికి చెందిన అనిమల్ కేర్ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక టీమ్ ద్వారా పట్టణంలోని వీధుల్లో సంచరిస్తూ ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తున్న వీధి క్కులను పట్టి తిరుపతిలోని ప్రత్యేక కేంద్రానికి తరలించేలా ఏర్పాటు చేశారు. వీధుల్లో వీధికుక్కలు సంచారం ఉన్నట్లయితే సచివాలయ సిబ్బందికి గాని, మున్సిపల్ అధికారులకు గాని సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు. ముఖ్యంగా ప్రజలు ఇళ్లలో మిగిలిన ఆహార వ్యర్థములు, రోడ్లపై, మురికి కాలువల గట్లపై పారావేయకుండా, మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు అందివ్వాలని, తద్వారా వీధుల్లో కుక్కల సంచారం అరికట్టవచ్చని కమిషనర్ తెలిపారు. పట్టణంలో ఉన్న మొత్తం వీధికుక్కలు పట్టే విధంగా ప్రత్యేక ప్రణాళిక చేసి బస్టాండు, గాలివీడు రోడ్, రామాపురం, కొత్తపేట, బోస్ నగర్ ఏరియాలోని కుక్కలను పట్టుకొని వాహనంపై తిరుపతికి తరలించినట్లు అధికారులు తెలిపారు.

## రాజంపేటలో బసవ జయంతి, శంకరాచార్యుల జయంతి వేడుకలు ప్రారంభం

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త**



రాజంపేట పట్టణం గడ్డివీధిలో బసవ జయంతి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పురోహితుడు హరి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బసవేశ్వరస్వామి పురాణ చరిత్రను వివరించారు. కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అలాగే చిన్నచావిడి వీధిలో జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అద్వైత సమితి వేదపండితులు అవధానం రాజశేఖర్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. గణపతి హోమం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అద్వైత సమితి అధ్యక్షులు పి.వల్లభరావు, ఇంకా శ్రీకాంత్‌విజయ్‌కృష్ణ, జయసింహ, సుబ్బుస్వామి, దినేష్‌కుమార్, శోమశేఖర్‌శర్మ, శంకరమఠం ప్రధాన అర్చకులు చోరగుడి దశరథరామశర్మ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుస్టేషన్ తనిఖీ చేసి ఎస్పీ గంగాధర్ రావు

**చిన్నమండెం,ఏప్రిల్ 23ప్రభాతవార్త:**



మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌ను జిల్లా ఎస్పీ గంగాధర్ రావు ఆదివారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల గురించి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐ రమేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రారంభమైన మహాభారత యజ్ఞం

**రామాపురం, ఏప్రిల్ 23ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన రామాపురంలో ఆదివారం నుండి 13వ శ్రీ పంచమ వేద మహాభారత యజ్ఞం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. 18 రోజుల పాటు జరిగే మహాభారత యజ్ఞానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటారు. ఉదయం భారత యజ్ఞ ప్రదేశంలో యాగశాలలో పూజలు నిర్వహించారు. హోమాలు పంచ పాండవుల పూజలు, కలశ పూజలు వంటివి నిర్వహించి మధ్యాహ్నం డీఎన్‌కే సీతామాలక్ష్మి మహాభారత యుద్ధాన్ని హరికథ రూపంలో చెప్పారు. మొదటి రోజు సర్పయాగం, వ్యాస జననం వంటి హరికథ రూపంలో ప్రజలకు వివరించారు. రాత్రి సమయంలో శ్రీ వెంకటేశ్వర నాట్యమండలి లక్కిరెడ్డిపల్లి వారు మహాభారత యజ్ఞాన్ని వేషధారణలో ప్రజలకు కనువిందు చేశారు. మహాభారత యజ్ఞాన్ని మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రమేష్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ నాగభూషణ్‌రెడ్డి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ మహాభారత అజ్ఞాని నాగబాసిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, దామోధర్‌నాయుడు, భక్తవత్సల రెడ్డి తదితరులు మహాభారత యజ్ఞానికి సహాయ సహకారాలు అందించనున్నారు.

## గంగమ్మ ఆలయంలో కిక్కిరిసిన భక్తులు

**లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**



రాయలసీమ జిల్లాలోని ప్రసిద్ధిగాంచిన అనంతపురం గంగమ్మ తల్లి ఆలయానికి ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. వేకువజాము నుంచి ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు ఆదిమూలం చిన్నప్ప వంశీయులు రెడ్డిశేఖర్, రామచంద్ర, వేమయ్య అమ్మవారి అభిషేకాలు అనంతరం ప్రత్యేక పూలతోనూ, నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించారు. వచ్చిన భక్తులకు ఆలయ ఈవో రవీంద్రరాజు, ఛైర్మన్ సామాల నర్సింహారెడ్డి, ఎండ తీవ్రతకు ఆలయంలో నీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మధుసూదన్‌రెడ్డి, మార్కండేయ నారాయణమ్మ, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్‌యార్డును అభివృద్ధి చేస్తా

**ఛైర్మన్ ముద్దలూరు సుబ్బరామరాజు**

**రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త**



రైల్వేకోడూరు మార్కెట్‌కమిటి యార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తానని నూతనంగా బాధ్యతలు చేపట్టిన ముద్దలూరు సుబ్బరామరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో మార్కెట్ పదవిని అప్పజెప్పిన పెద్దలు పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులుకు జీవితాంతం రుణపడి ఉండి వారి చూపిన బాటలోనే పయనించి పార్టీకి అహర్నిశలు, రైతులకు అందుబాటులో ఉండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను మారుమూల పల్లెలకు చేరుస్తానన్నారు. దేశచరిత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం ఏర్పాటు చేసిన పథకాలను అన్ని ప్రాంత రైతులకు అందుబాటులో ఉండి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.

## రోడ్డు ప్రమాదంలో బాలుడికి తీవ్ర గాయాలు


**లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**



మండల కేంద్రమైన లక్కిరెడ్డిపల్లె, చింతకొండపల్లి మధ్య చర్చీ వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిఖిల్ అనే బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. క్షతగాత్రుడు నిఖిల్ లక్కిరెడ్డిపల్లె నుంచి కాలి నడకతో అమ్మవారి ఇల్లు అయిన చింతకుంట పల్లెకు నడుచుకుంటూ వెళ్తుండగా వేంపల్లె వైపు నుంచి వస్తున్న స్కూటర్లతో తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స నిర్వహించారు. మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

## మానవతా డైరెక్టరీ ఆవిష్కరణ

**లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**



మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మల్లన్న పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్ ముఖ్య అతిథులుగా విచ్చేసి మానవతా సేవలు వివరించారు. జిల్లా అధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్ ఛైర్మన్, కార్యదర్శి బాలాజీరెడ్డి, జిల్లా నాయకులు ఎస్.నరసింహారెడ్డి, టి.రవీంద్ర, కోశాధికారి శివయ్య కార్యవర్గం డైరెక్టరీ ఆవిష్కరణ చేశారు. జిల్లా అధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, ఛైర్మన్ మాట్లాడుతూ మానవతా లక్కిరెడ్డిపల్లె మానవతా శాఖ అనేక సేవా కార్యక్రమంలో ఉచిత బాడీ ఫ్రీజర్, శాంతిరథం, రాయచోటి వారి సహాయంతో అంబులెన్స్, ప్రతిభ కలిగిన విద్యార్థులకు రూ.25వేలు ఇవ్వడమే కాక ప్రజలకు అనేక సేవలు అందిస్తూ ఉంది. వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి ఆశయాలను మానవతా కుటుంబ సభ్యులందరూ కలిసి కృషి చేసి మానవతా సేవా సంస్థ అభివృద్ధికి సహాయ సహకారం అందించాలన్నారు. మానవతా డైరెక్టరీలో మానవతా ఆశయాలు, సేవా కార్యక్రమాలు తెలియజేస్తూ ఏపీలోని అన్ని శాఖల వివరాలు ముఖ్యమైన సభ్యులు ఫోన్ నెంబర్లు ఇవ్వడం జరిగింది. త్వరలో దాతల సహకారంతో నాలుగు ఫ్రీజర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిలను వై.భాస్కర్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్‌లను వై.భాస్కర్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ కృష్ణమూర్తి, సీనియర్ ఫార్మసిస్ట్ వారిని మానవతాకు పరిచయం చేస్తూ సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, ఛైర్మన్ బాలసుబ్రమణ్యం, సెక్రటరీ బాలాజీరెడ్డి, కోశాధికారి అరె శివయ్య, జిల్లా డైరెక్టర్లు సామాల నరసింహారెడ్డి, రవీంద్ర, వి.రాజారెడ్డి, వీవీ రమణారావు, ఎ.సుబ్బారెడ్డి, రక్తనిధి పక్కీరయ్య, రామచంద్ర, బాబు, శ్రీరాములు పాల్గొన్నారు.

## జవానులపై ఉగ్రదాడి అమానుషం

**కడప కార్పొరేషన్, ఏప్రిల్ 23, ప్రభాతవార్త:**




కాశ్మీర్‌లోని పూంచ్ లోయలో ఐదు మంది భారత జవానులపై ఉగ్రవాదులు దాడులు చేసి సజీవదహనం చేయడం బాధాకరమని విశ్వహిందూ పరిషత్ నాయకులు అన్నారు. ఆదివారం కడప విశ్వహిందూ పరిషత్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో అశువులు బాసిన వీర జవానులకు సంతాపాన్ని పాటిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. వీ.హెచ్.పి కార్యాలయం నుంచి పాత బస్టాండు, ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. మరణించిన వీర జవానులకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. వవీర స్వర్గం పొందిన వీర జవానుల ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీ మాలిగి విద్యానిధి స్వామీజీ, వీహెచ్‌పీ నాయకులు రామ్, మహేష్‌లు మాట్లాడుతూ భారత సైన్యానికి బాసటగా ఎల్లప్పుడూ విశ్వహిందూ పరిషత్ నిలుస్తుందన్నారు. భారత మాత కోసం ధర్మ పరిరక్షణకు తోడ్పాటును అందించి ప్రతి భారతీయుని ఒక సైనికుడిగా తీర్చిదిద్ది దేశ పరిరక్షణలో సంఘటిత శక్తిని చూపుతామని ప్రతిజ్ఞ చేశామన్నారు. వీహెచ్‌పీ నాయకులు చెన్నకృష్ణారెడ్డి, సురేంద్ర, సంజీవరాజు, ఆర్ఎస్ఎస్ శివప్రసాద్, హిందూ చైతన్య వేదిక నీలకంఠారెడ్డి, బీజేపీ నేత లక్ష్మీనారాయణరెడ్డి, కార్యకర్తలు స్వయం సేవకులు పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం

**– ఎపి రెడ్డి సంఘం అధ్యక్షులు కసిరెడ్డి శివారెడ్డి**

**గాలివీడు, ఏప్రిల్ 23ప్రభాతవార్త:**



క్రీడలతోనే శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎపి రెడ్డి సంఘం అధ్యక్షులు కసిరెడ్డి వెంకటశివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గోరాన్ చెరువు గ్రామం వడిశలంకపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేత ఎంఐ వెంకి జట్టుకు రూ.50000 మొదటి బహుమతి, రన్నర్స్ జట్టు వనిత మార్ట్ టీమ్‌కు రూ. 30000 నగదు బహుమతులలను కసిరెడ్డి శివారెడ్డి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులకు భోజన వసతిని వైకాపా మండల యూత్ నాయకులు వెంకట్రామిరెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హక్కుల సాధన కొరకై రాజ మహేంద్రవరం సభను విజయవంతం చేయండి

**– యర్రపురెడ్డి శ్రీనివాసులురెడ్డి**

**రాయచోటి టౌన్, ఏప్రిల్ 23ప్రభాతవార్త:**



ఉద్యోగుల హక్కుల వారి డామండల్ల సాధన కొరకై రామమహేంద్రవరం సభను విజయవంతం చేయాలని ఎపిజిఈఏ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు యర్రపురెడ్డి శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం జిల్లా కార్యాలయం నందు కార్యవర్గం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యశాఖ ఉద్యోగులపై అదనపు భారం తగ్గించాలని సమస్యలు పరిష్కరించాలని, అనేక పర్యాయాలు విన్నవించిన సరైన స్పందన లేదన్నారు. సంవత్సరాలు గడుస్తున్నా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన రానందున ఈనెల 18వ తేదీన విజయవాడలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్ణయం మేరకు ఈనెల 30న రాజమహేంద్రవరంలో ఎపిజిఈఏ రాష్ట్ర సదస్సును ఏర్పాటు చేయడమైందన్నారు. కావున 26 జిల్లాల శాఖల సమక్షంలో కార్యచరణ ప్రకటించడానికి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె. ఆర్. సూర్యనారాయణ, జి ఆస్కార్ రావు నిర్ణయించారన్నారు. వారి పిలుపుమేరకు వెళ్లడానికి మనమందరం సిద్ధంగా ఉండాలని రాజమహేంద్రవరంలో జరుగు మహాసభవిజయవంతం చేయాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా కార ్యదర్శి గురుప్రసాద్, కోశాధికారి సుధాకర్‌రాజు, వైస్ ప్రెసిడెంట్ ఎం. రెడ్డినాయక్, ప్రవీణ్‌కుమార్‌రాజు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులు, రాయచోటి తాలుకా అధ్యక్షులు సాయికుమార్, కార్యదర్శి సుజిత్, లక్కిరెడ్డిపల్లి తాలుకా అధ్యక్షులు తిమ్మారెడ్డి, కార్యదర్శి దేవేందర్‌రెడ్డి, ఎపిహెచవో జిల్లా అద్యక్షులు ఆర్. కృష్ణయ్య, పెన్షనర్ జిల్లా అధ్యక్షులు హౌస్ బిల్డింగ్ సొసైటి డైరెక్టర్ సిద్ధయ్య నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ప్రణాళిక ప్రకారమే చంద్రబాబుపై దాడి

**– మాజీ ఎమ్మెల్యే రమేష్‌కుమార్ రెడ్డి**

**రాయచోటి టౌన్, ఏప్రిల్ 23ప్రభాతవార్త:**




ప్రణాళిక ప్రకారం మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై దాడి చేశారని మాజీ ఎమ్మెల్యే రాయచోటి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ రమేష్ కుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం టిడిపి పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పరిపాలన ఏ విధంగా సాగుతుందో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని చంద్రబాబు నాయుడు పై ఎర్రగొండపాలెం పర్యటనలో వైసిపి గుండాల రాళ్లదాడి చేయడం హేయమైన చర్య అన్నారు. సాక్షాత్తు వైసిపి మంత్రి అడ్డంకులు సృష్టించడం సెక్యూరిటీ ఇవ్వాల్సిన పోలీసులు దాడికి సహకరించడం చూస్తుంటే ఈ రాష్ట్రంలో వైసిపి గుండాలు వైసీపీ నాయకులు తప్ప ప్రతిపక్ష నాయకులను గాని సామాన్య ప్రజలను తిరగనివ్వరా అని ఆయన ప్రశ్నించారు. సాక్షాత్తు రాష్ట్రం మంత్రిగా ఉంటూ ఈ విధంగా అజ్ఞానంతో ప్రవర్తించడం చాలా దుర్మార్గమని ఒక మంత్రి రోడ్డుపైన బయటాయించడం చొక్కా ఇప్పి సవాలు విజయం ఏ విధమైన సంకేతాలు ఇస్తున్నారని దానిని ప్రజలు గమనిస్తున్నారని వారన్నారు. జెడ్ ప్లస్ కేటగిరి సెక్యూరిటీ ఉన్న చంద్రబాబు నాయుడు పర్యటను అడ్డుకోవడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. ఫిబ్రవరి 17వ తారీఖున అనపర్తిలో చంద్రబాబు నాయుడు పర్యటనను పోలీసులు అడ్డుకున్నారని పోలీసులు అడ్డుకోవడమే కాకుండా పోలీస్ వాహనాలు అడ్డుపెట్టడం సాక్షాత్తు పోలీస్ కానిస్టేబుల్ రోడ్డుపై కూర్చోబెట్టడం ఇటువంటి వింత పోగడలు ఆరోజు అనపర్తిలో చూసామని అనపర్తి కార్యకర్తలు ఎక్కువ చంద్రబాబునాయుడు ధైర్యం చంద్రబాబు నాయుడు ఎటువంటి పరిస్థితులను కార్యక్రమం పూర్తి చేయాలని ప్రజలను ఉద్దేశించి మాట్లాడాలని మొక్కవోని దీక్షతో ఆరోజు కార్యక్రమం విజయవంతం కావడంతో నిన్న ఎర్రగొండపాలెం లో మరో విధంగా అడ్డుకోవాలని ప్రయత్నం చేశారని ఆయన తెలిపారు.

## రాయచోటిలో ఘనంగా వార్త ఈడి గౌరవసంఘీ జన్మదిన వేడుకలు

**రాయచోటి, ఏప్రిల్ 23ప్రభాతవార్త:**



రాయచోటి పట్టణం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వార్తా దినపత్రిక ఈడి గౌరవ సంఘీ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం 100 మంది రోగులకు పండ్లు, బ్రెడ్లు సీనియర్ డాక్టర్ మహేశ్వరరాజు కడప అన్నమయ్య జిల్లాల వార్త దినపత్రిక బ్యూరో అండ్ బ్రాంచ్ మేనేజర్ రఘునాథ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. పండ్లుబ్రెడ్లు రాయచోటి పట్టణం బిల్టప్ పి. శివారెడ్డి, ఎస్బీఎంఎస్ టైల్స్ లోకేష్‌రెడ్డి, మట్లి సర్పంచ్ నాగార్జునాచారి ఆర్థిక సాయంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్సి ఇన్‌ఛార్జ్ ఎ.వెంకట్రామిరెడ్డి, విలేకరులు వంశీకృష్ణ, లక్ష్మీకర్‌నాయుడు, మట్లి సర్పంచ్ నాగార్జునాచారి, బిల్డర్ శివారెడ్డి, ఎస్‌బిఎం టైల్స్ యజమాని లోకేశ్వర్‌రెడ్డిలు పాల్గొని గౌరవ సంఘీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

## డివైఎఫ్ఐ పట్టణ మహిళా కన్వీనర్‌గా గురుదేవి ఎన్నిక

**కో-కన్వీనర్‌గా నాగేశ్వరి ఎన్నిక**

**బద్వేల్ అర్బన్, ఏప్రిల్ 23ప్రభాతవార్త:**



భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ మహిళా కన్వీనర్ గా సి గురుదేవి ఎన్నిక కో కన్వీనర్‌గా నాగేశ్వరి లను మరో ఆరు మందిని సభ్యులుగా ఎన్నిక చేసినట్లు డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ మహిళా కన్వీనర్ సి గురుదేవి కో కన్వీనర్‌గా నాగేశ్వరిలు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో డివైఎఫ్ఐ పిలుపులు పోరాటాలకు మేము ముందుంటామని అలాగే బద్వేల్ పట్టణంలో నిరుద్యోగ యువతీ యువకుల సమస్యల పైన మహిళల సమస్యల పైన ప్రజా సమస్యల పైన పోరాటాలు ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వారి పక్షాన ముందుండి మా వాణి వినిపిస్తామని అలాగే కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కోసం జిల్లాలో పరిశ్రమల కోసం నిరుద్యోగులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల పైన బద్వేల్ పట్టణ అభివృద్ధి పైన విద్యార్థి విద్యార్థినీలు సమస్యల పైన పోరాడుతామని మా మీద నమ్మకంతో ఈ బాధ్యతలు అప్పజెప్పినందుకు ముందుగా ఆ రాష్ట్ర కమిటీకి జిల్లా కమిటీకి ధన్యవాదాలు తెలియజేసుకుంటూ డివైఎఫ్ఐ యువజన సంఘాన్ని బలోపేతం చేసే దిశగా కృషి చేస్తామని మా మీద పెట్టుకున్నటువంటి నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి పనిచేస్తామని వారు తెలిపారు.

## కుట్టు శిక్షణ పేరుతో మహిళలకు కుచ్చుటోపీ

**స్వచ్ఛంద సంస్థ వసూలు చేసి పరార్**

**రాజంపేట అర్బన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త**



కుట్టు శిక్షణ పేరుతో మహిళల దగ్గర సొమ్ము వసూలు చేసి పత్తాలేకుండా పోయిన ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుల ఉదంతమిది. రాజంపేట మండలం ఎంజి పురంలో మోసానికి గురైన బాధిత మహిళల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇసుకపల్లెలో మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇస్తామని రూరల్‌కింగ్‌డమ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ అనే సంస్థ 4 కుట్టుమిషన్లు పెట్టి కార్యాలయాన్ని ప్రారంభించింది. టైలరింగ్ శిక్షణ పేరుతో సుమారు 120 మంది మహిళల దగ్గర 600 చొప్పున వసూలు చేసింది. శిక్షణ అనంతరం ఉపాది అవకాశాలు కల్పించి ఆర్థిక చేయూత ఇస్తామని ఆశలు రేకెత్తించింది. ఈ విధంగా 72 వేలు వసూలు చేసి స్వచ్ఛంద సంస్థ పత్తా లేకుండా పోయింది. గత కొన్నిరోజులుగా కుట్టు శిక్షణ కేంద్రం తెరచకపోవడంతో మహిళలు అనుమానంతో కార్యాలయాన్ని పరిశీలించారు. మహిళలు ఇచ్చిన దరఖాస్తు పత్రాలు, దరఖాస్తులు చిందరవందరంగా పడి ఉన్నాయి. ఫోన్ చేస్తే స్పందన లేదు. దీంతో మహిళలు తాము మోసపోయామని తెలుసుకున్నారు. తమను మోసం చేసిన స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళలు మీడియా ఎదుట డిమాండ్ చే శారు.

## నేటి విద్యార్థులే రేపటి బావితరాల పౌరులు

**విద్యార్థుల చదువులే తల్లిదండ్రులకు ఆస్తి**

**– జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డా॥ అంబవరం ప్రభాకర్ రెడ్డి**

**బద్వేలు అర్బన్, ఏప్రిల్ 23 ప్రభాతవార్త :**



నేటి విద్యార్థులే రేపటి భావితర పౌరులు మరియు సమాజ నిర్దేశకులని జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డా॥ అంబవరం ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ కార్పోరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా॥ హనుమంతు వెంకట సుబ్బయ్య అన్నారు. ఆదివారం బద్వేలు పట్టణంలోని దీప్తి నవోదయ మరియు సైనిక్ స్కూల్ కోచింగ్ సెంటర్ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా జిల్లా సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారి డా॥ అంబవరం ప్రభాకర్ రెడ్డి, ఎస్సీ కార్పోరేషన్ ఈడి డా॥ హనుమంతు వెంకట సుబ్బయ్య హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచీకరణ వ్యవస్థలో మారుతున్నటువంటి నూతన పోకడలకు అనుగుణంగా విద్యా వ్యవస్థలో అనేక మార్పులు వస్తున్నాయని, తద్వారా విద్యార్థులు పోటీ పరీక్షలను ఎదుర్కొనేలా చదువులు ఉండాలని తెలియజేశారు. ఈ పోటీ పరీక్షలకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాలలో ఉన్నటువంటి విద్యార్థులు వారి తల్లిదండ్రుల ఆశయ సాదనలో మేమున్నామంటూ ప్రతి సంవత్సరం సీట్లు సాధిస్తున్న స్థానిక బద్వేలు పట్టణంలోని శ్రీ దీప్తి నవోదయ సైనిక్ కోచింగ్ సెంటర్ యాజమాన్యాన్ని డా॥ అంబవరం ప్రభాకర్ రెడ్డి మరియు డా॥ హనుమంతు వెంకట సుబ్బయ్య అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రతి యేటా నవోదయ మరియు సైనిక్ స్కూల్ సీట్లు సాధిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు మరియు మా కళలను సాకారం చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఉద్వేగంతో తమ ఆనందాన్ని చెప్పడంతో సభ ప్రాంగణం అంతా చప్పట్లతో కూడిన వాతావరణం ఏర్పడింది. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ ప్రవీణ్ మరియు సమాజ సేవకులు జమాల్ మాట్లాడుతూ రానున్న కాలంలో బద్వేలు పట్టణం నుండి మరింత మంది విద్యార్థులు నవోదయ మరియు సైనిక్ స్కూల్‌లో అడ్మిషన్ వచ్చే విధంగా నాణ్యమైన విద్యాబోధనకు చర్యలు తీసుకుంటామని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో చెన్నయ్య, మహేశ్వర రెడ్డి స్కూల్ కరస్పాండెంట్ మహేశ్వర రెడ్డి, ఎస్టీయు రాష్ట్ర నాయకులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, గంగసాని సాంబశివారెడ్డి చేతుల మీదుగా సీట్లు సాధించిన 15 మంది విద్యార్థులకు మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జమాల్, ప్రవీణ్ కుమార్, నరసింహా రెడ్డి, విద్యార్థినీ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.